# పేపర్ టైగర్‌గా మారిన ఐరాస !

## (21 సెప్టెంబర్ " అంతర్జాతీయ శాంతి దినోత్సవం" సందర్భంగా)

ప్రపంచవ్యాప్తంగా నేడు అశాంతి మేఘాలు కమ్ముకున్నాయి. ప్రత్యక్ష, పరోక్ష, ప్రచ్ఛన్న యుద్ధాలు కొనసాగుతూనే ఉన్నాయి. శాంతి పావురాలు స్వేచ్ఛగా తిగలేని దుస్థితి వచ్చింది. ఏండ్ల తరబడి యుద్ధాలు కోనసీగుతూనే ఉన్నాయి. 24 ఫిబ్రవరి 2022న ప్రారంభంపైన ఉక్రెయిన్-రష్యా యుద్ధం నేటికీ మారణహోమాన్ని నమోదు చేస్తూనే ఉన్నది. 07 అక్టోబర్ 2023న ప్రారంభమైన ఇజ్రాయిల్ - పాలస్తీనా (గాజా) యుద్ధం నేటికీ బాంబుల వర్షం కురిపిస్తూనే ఉన్నది. ఈ రెండు యుద్ధాల్లో లక్షల ప్రాణాలు గాల్లో కలిసాయి. మిలియన్ల అమాయక ప్రజలు ప్రాణాలు అరచేతుల్లా పెట్టుకొని వలసలు వెళుతూనే ఉన్నారు లేదా శరణార్థి శిబిరాల్లో దుర్భర జీవితాలను గడుపుతూనే ఉన్నారు. భారత్ - పాకిస్థాన్ మధ్య అనిశ్చిత స్థితి కొనసాగుతూనే ఉన్నది. యుద్ధాలను, సంక్షోభాలను ఆపడానికి ఐరాస మధ్యవర్తిత్వం పనిచేయడం లేదు. ఐరాస పేపర్ టైగర్‌గా మారింది. ట్రంప్ నాటకాలు కూడా ప్రపంచ అశాంతికి ఆజ్యం పోస్తున్నాయి.

అంతర్జాతీయ శాంతి దినం-2025 ఇతివృత్తం:

యుద్ధాలతో ప్రాణ ఆస్తి నష్టాలతో పాటు మానవ హక్కులు హననం చేయబడుతున్నాయి. రష్యా, ఇజ్రాయిల్ దేశాల అగ్ర నాయకులు పుతిన్, నేతన్యాహూల అనాలోచిత ఆలోచనలతో యుద్ధాలు తీవ్రరూపం దాల్చడానికి దోహదపడుతున్నాయి. అస్థిరత రాజ్యమేలుతున్నది. ఆధిపత్య ధోరిణి రెట్టింపు అవుతున్నది. ప్రపంచవ్యాప్తంగా శాంతియుత వాతావరణం నెలకొనడానికి 1981లో ఐరాస తీసుకున్న ఏకగ్రీవ తీర్మానం ప్రకారం ప్రతి ఏట 21 సెప్టెంబర్ రోజున ప్రపంచ దేశాలు "అంతర్జాతీయ శాంతి దినం (ఇంటర్నేషనల్ పీస్ డే)" పాటించడం ఆనవాయితీగా మారింది. శాంతి నెలకొన్నప్పుడు పేదరికం తగ్గుతుంది, సామాజిక సహనశీలత పెరుగుతుంది. అంతర్జాతీయ శాంతి దినం-2025 ఇతివృత్తంగా "విశ్వశాంతికి నేడే పూనుకోవడం - శాంతి సంస్కృతిని పెంపొందించడం" అనబడే అంశాన్ని తీసుకొని ప్రచారం నిర్వహిస్తున్నారు. నేడు ప్రపంచాన్ని సాయుధ పోరాటాలు, విపరీత వాతావరణ ప్రతికూల మార్పులు, భౌగోళిక ఆర్థిక సంక్షోభాలు, తప్పుడు వార్తలు లేదా సమాచారాల వ్యాప్తి, సామాజిక భావ విచ్ఛిన్నం, ఆర్థిక అడ్డంకులు, నిరుద్యోగం, మానవ హక్కుల ఉల్లంఘనలు, ఉగ్రవాదం, అసమానతలు లాంటివి ప్రపంచ శాంతిని హరిస్తున్నాయి.

యుద్ధాలతో అధోగతి :

నేడు 3వ ప్రపంచ యుద్ధమే జరిగితే క్షణాల్లో ప్రపంచం కాలి బూడిద కావడం ఖాయంగా తోస్తున్నది. డిజిటల్ యుద్ధ నీతి భూమిని మరుభూమిగా మార్చగలదు. ప్రపంచ శత్రువులుగా పేదరికం, నిరుద్యోగం, నిరక్షరాస్యత, అసమానతలు రాజ్యమేలుతున్న వేళ అత్యాధునిక ఆయుధాలతో రక్తపాత యుద్ధాలు అర్థరహితం. కోవిడ్ విపత్తు యుద్ధాన్ని గెలిచాం. వాతావరణ ప్రతికూల మార్పులతో పోరులో నెగ్గుదాం. ప్రకృతి విపత్తులను ఎదుర్కోవడం పట్ల నిలిచి గెలుద్దాం. మానవత్వమే శాంతి మహా మంత్రంగా నిత్యం జపిద్దాం. స్వీయ నియంత్రణ, పరమత సహనాలతో శాంతి పావురాలు స్వేచ్ఛగా ఎగరాలి. యుద్ధాలతో శాంతి స్థాపన జరగదు. సంక్షోభాలతో సంక్షేమం ఫలించదు. చేతులు కలిపితే అభివృద్ధి, తొడగితే అధోగతి తప్పదు. బాంబులతో విధ్వంసం, జవాబులతో వికాసం జరుగుతుంది. సరిహద్దులు చెరిగిపోయి, డిజిటల్ వలయంలో ప్రపంచమే కుగ్రామం అయిన వేళ శాంతి మాత్రమే మానవాళి శ్రేయస్సుకు పునాది అవుతుందని అని తెలుసుకోవాలి.

ప్రపంచ శాంతికి ఉపకరించే విధంగా పేదరిక, ఆకలి రహిత సమాజ స్థాపన, విద్య వైద్య లింగ అసమానతలు, క్లీన్ ఎనర్జీ-నీటి లభ్యత, గ్లోబల్ సమన్వయం లాంటి ఐరాస సుస్థిరాభివృద్ధి లక్ష్యాలు-2030 నిర్ణయించబడ్డాయి. ప్రపంచ శాంతి కోసం చర్చలు, సదస్సులు, విద్యాలయాల్లో పోటీలు, కార్యశాలలు లాంటివని నిర్వహించాలి. అహింస, పరస్పర గౌరవం, లోతైన అవగాహన లాంటి భావనలను ప్రోత్సహించాలి. అన్ని ఆయుధాల కన్న శక్తివంతమైనది శాంతి మాత్రమే అని తెలుసుకుందాం. విభేదాలు మరిచి ఐక్యంగా ముందుకు సాగుదాం. మానవ హక్కులకు పట్టం కడదాం. యుద్ధాలు, మానవ ప్రేరేపిత సంక్షోభాలకు చరమగీతం పాడుదాం.

-డా॥బుర్ర మధుసూదన్ రెడ్డి
9949700037

# ఆహార శుద్ధి రంగంలో వ్యాపార నిర్వహణ సౌలభ్యాన్ని పెంచడంలో జీఎస్టీ సరికొత్త సంస్కరణల ప్రభావంపై వ్యాసం.. ప్రజలతో పంచుకున్న ప్రధానమంత్రి

న్యూఢిల్లీ, సెప్టెంబర్ 20:కేంద్ర మంత్రి శ్రీ చిరాగ్ పాసవాన్ రాసిన ఒక వ్యాసాన్ని ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ ఈ రోజు ప్రజలతో పంచుకున్నారు. జీఎస్టీ లో తాజాగా ప్రవేశపెట్టిన సంస్కరణలు కేవలం సాంకేతిక పరమైన మార్పులు కాదనీ, జీవన సౌలభ్యాన్నీ, వ్యాపార నిర్వహణలో సౌలభ్యాన్నీ, పెట్టుబడి పెట్టడంలో సౌలభ్యాన్నీ పెంచే సాహసిక నిర్ణయాలని మంత్రి తన వ్యాసంలో అభివర్ణించారు. "నిత్యం ఉపయోగించే ఆహార పదార్థాలతో పాటు ప్యాకేజింగ్‌పై కూడా రేట్లను తగ్గించడంతో, రోజువారీ వాడుకొనే సరకులు మరింత చౌకగా అందుబాటులోకి వస్తాయి.. ఎంఎస్ఎంఈలకు ఊతం, రైతులకు మద్దతూ లభిస్తాయి.. ఆహార వస్తువుల రంగంలో ప్రపంచ దేశాలతో భారత్ పోటీ పడే తీరు కూడా మెరుగవుతుంది" అని శ్రీ మోదీ అన్నారు.

సామాజిక మాధ్యమం "ఎక్స్"లో కేంద్ర మంత్రి శ్రీ చిరాగ్ పాసవాన్ నమోదు చేసిన ఒక సందేశానికి శ్రీ మోదీ ఇలా స్పందించారు:

"జీఎస్టీలో తీసుకువచ్చిన సరికొత్త సంస్కరణలు ఒక్క సాంకేతిక పరమైన మార్పులు మాత్రమే కాదు.. అవి జీవన సౌలభ్యాన్నీ, వ్యాపార నిర్వహణలో సౌలభ్యాన్నీ, పెట్టుబడి పెట్టడంలో సౌలభ్యాన్నీ పెంచే సాహసిక నిర్ణయాలు అని కేంద్ర మంత్రి శ్రీ చిరాగ్ పాసవాన్ పేర్కొన్నారు. నిత్యం ఉపయోగించే ఆహార పదార్థాలతో పాటు ప్యాకేజింగ్‌పై కూడా రేట్లను తగ్గించడంతో, రోజువారీ వాడుకొనే సరకులు మరింత చౌకగా అందుబాటులోకి వస్తాయి. ఎంఎస్ఎంఈలకు ఊతం, రైతులకు మద్దతూ లభిస్తాయి. ఆహార వస్తువుల రంగంలో ప్రపంచ దేశాలతో భారత్ పోటీ పడే తీరు కూడా మెరుగవుతుంది."

# మిషన్ సక్షమ్ అంగన్వాడీ, పోషణ్ 2.0'పై వ్యాసాన్ని ప్రజలతో పంచుకున్న ప్రధానమంత్రి

న్యూఢిల్లీ, సెప్టెంబర్ 20:కేంద్ర మంత్రి శ్రీమతి అన్నపూర్ణా దేవి రాసిన ఒక వ్యాసాన్ని ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ ప్రజలతో ఈ రోజు పంచుకున్నారు. బాలలు, కౌమార దశలో ఉన్న బాలికలు, గర్భిణులతో పాటు బాలింతల పోషణను మెరుగుపరచడానికి 'మిషన్ సక్షమ్ అంగన్వాడీ, పోషణ్ 2.0' పేరిట ఒక ప్రధాన కార్యక్రమాన్ని అమలుచేస్తున్నట్లు మంత్రి ఈ వ్యాసంలో పేర్కొన్నారు. "దేశవ్యాప్తంగా విస్తరించిన అంగన్వాడీ కేంద్రాల విస్తృత వ్యవస్థ ద్వారా లక్షల మంది లబ్ధిదారులు ఈ పథకంలో భాగంగా సాయాన్ని అందుకున్నారు" అని శ్రీ మోదీ అన్నారు.

సామాజిక మాధ్యమం "ఎక్స్"లో కేంద్ర మంత్రి శ్రీమతి అన్నపూర్ణా దేవి నమోదు చేసిన ఒక సందేశానికి శ్రీ మోదీ ప్రతిస్పందిస్తూ,

"బాలలు, కౌమార దశలో ఉన్న బాలికలతో పాటు గర్భవతులు, బాలింతల పోషణను మెరుగుపరచడానికి తీసుకువచ్చిన ఒక భారీ కార్యక్రమం 'మిషన్ సక్షమ్ అంగన్వాడీ పోషణ్ 2.0'. దీనిలో భాగంగా.. దేశం నలుమూలలా విస్తరించిన అంగన్వాడీ కేంద్రాల విస్తృత వ్యవస్థ ద్వారా కోట్లాది లబ్ధిదారులకు సాయం అందుతోంది. మహిళలు, బాలల అభివృద్ధి మంత్రిత్వ శాఖ ఈ పథకంతో బాలల భవిష్యత్తును తీర్చిదిద్దుతున్న తీరును కేంద్ర మంత్రి అన్నపూర్ణా దేవి గారు ఒక వ్యాసంలో సమగ్రంగా తెలిపారు..."

# సాంకేతికత... భారతదేశంలో సమానత్వ సాధనం...

## -శ్రీ అశ్వనీ వైష్ణవ్ వ్యాసాన్ని ప్రజలతో పంచుకున్న ప్రధానమంత్రి

న్యూఢిల్లీ, సెప్టెంబర్ 20:కేంద్ర మంత్రి శ్రీ అశ్విని వైష్ణవ్ సాంకేతికతపై రాసిన ఒక వ్యాసాన్ని ప్రధాన మంత్రి శ్రీ నరేంద్ర మోదీ ప్రజలతో ఈ రోజు ప్రజలతో పంచుకున్నారు. భారతదేశంలో సాంకేతికత సమానత్వాన్ని తెస్తోందనీ, వీధి వ్యాపారుల నుంచి కార్పొరేట్ అధికారుల వరకూ అందరినీ సాధికారులను చేస్తోందనీ కేంద్ర మంత్రి శ్రీ అశ్వనీ వైష్ణవ్ తన వ్యాసంలో పేర్కొన్నారు. ఇండియా స్టాక్, యూపీఐ, జేఏఎం త్రయం, కోవిన్ వంటి వినూత్న కార్యక్రమాలూ, వీటితోపాటు ఆవిష్కరణలూ, సమ్మిళిత్వం వంటి అంశాలూ ప్రజల జీవితాల్ని మార్చివేస్తున్నాయని ప్రధాని పేర్కొన్నారు.

"భారతదేశంలో సాంకేతికత సమానత్వాన్ని తెస్తోందనీ, వీధి వ్యాపారుల నుంచి కార్పొరేట్ అధికారుల వరకూ అందరినీ సాధికారులను చేస్తోందనీ కేంద్ర మంత్రి శ్రీ అశ్వనీ వైష్ణవ్ ఒక వ్యాసంలో పేర్కొన్నారు. ఇండియా స్టాక్, యూపీఐ, జేఏఎం త్రయం, కోవిన్ వంటి వినూత్న కార్యక్రమాలూ, వీటితోపాటు ఆవిష్కరణలూ, సమ్మిళిత్వం వంటి అంశాలూ ప్రజల జీవితాల్ని మార్చివేస్తున్నాయి. ఇవన్నీ ప్రభుత్వ పాలనను మెరుగుపరచడంతోపాటు ప్రపంచ స్థాయిలో భారతదేశం పాత్రను మరింత బలోపేతం చేశాయి"

# భారత్-ఈయూ ఎఫ్టీఏ త్వరగా కొలిక్కిరావాలంటూ మద్దతు తెలిపిన ప్రధాని శ్రీ మిట్సోటాకిస్

న్యూఢిల్లీ, సెప్టెంబర్ 20:హెలెనిక్ రిపబ్లిక్ ప్రధాని గౌరవ కిరియాకోస్ మిట్సోటాకిస్ ఈ రోజు ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీకి ఫోన్ చేశారు.

ప్రధానమంత్రి శ్రీ మోదీ పుట్టిన రోజు సందర్భంగా, ప్రధాని శ్రీ మిట్సోటాకిస్ మనస్ఫూర్తిగా శుభాకాంక్షలు తెలిపారు. ఈ ప్రతిగా ప్రధానమంత్రి శ్రీ మోదీ కృతజ్ఞతలు తెలియజేశారు.

వాణిజ్యం, పెట్టుబడి, టెక్నాలజీ, నౌకాయానం, రక్షణ, భద్రత, సంధానం, ఇరు దేశాల ప్రజల మధ్య సంబంధాల వంటి రంగాల్లో చేసుకున్న అభివృద్ధిని నేతలు స్వాగతించారు. భారత్-గ్రీస్ వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని మరింత ముందుకు తీసుకెళ్లాలని నిర్ణయించుకున్నారు.

భారత్-ఈయూ స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం రెండు దేశాలకూ ప్రయోజనం కలిగించేదిగా రూపొందాలనీ, ఈ ఒప్పందం త్వరిత గతిన తుది రూపును దిద్దుకోవాలనీ ప్రధాని శ్రీ మిట్సోటాకిస్ కోరుకుంటూ, ఈ దిశగా జరుగుతున్న ప్రయత్నాలకు గ్రీస్ మద్దతిస్తుందన్నారు. వచ్చే సంవత్సరం 2026లో భారత్ నిర్వహించే ఏఐ ఇంపాక్ట్ సమ్మిట్ ఫలప్రదం కావాలని కూడా ఆకాంక్షించారు. ఉభయ దేశాల ప్రయోజనం ముడిపడి ఉన్న ప్రాంతీయ, అంతర్జాతీయ అంశాలపై ఇద్దరు నేతలూ తమ ఆలోచనలను పంచుకున్నారు.

సంప్రదింపులను కొనసాగించాలని కూడా వారు నిర్ణయించుకున్నారు.

# ఆర్టీసీ బస్టాండ్లలో పని చేస్తున్న కార్మికులకు పని భద్రత కల్పించాలి : మంద సంపత్



వరంగల్, సెప్టెంబర్ 20:హనుమకొండ ఆర్టీసీ బస్టాండ్లలో పనిచేస్తున్న కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ కార్మికుల పట్ల వివక్షత చూపుతున్న వారిపై చర్యలు తీసుకోవాలని, కార్మికులకు పనిభద్రత కల్పించాలని కేవీపీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి మందసంపత్ డిమాండ్ చేశారు.

శనివారం హనుమకొండలో జరిగిన కేవీపీఎస్ జిల్లా అత్యవసర సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. హనుమకొండలోని ఆర్టీసీ బస్టాండ్లలో ఎక్కువగా దళిత మహిళలు కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ కార్మికులుగా పనిచేస్తున్నారన్నారు. చాలీ చాలని జీతాలతో అవస్థలు పడుతున్నారని, కుటుంబాన్ని పోషించేందుకు విధి లేని పరిస్థితుల్లో ఈ పనులు చేస్తున్నారని అన్నారు. అయితే కొందరు సంబంధిత అధికారులు నిత్యం వారిని వేధింపులకు గురి చేస్తూ అనేక రకాలుగా అవమానపరుస్తున్నారని, దీని వెంటనే అరికట్టాలన్నారు.

గత 15 సంవత్సరాలుగా వరంగల్ -1 డిపోలో పనిచేస్తున శనిగరపు పూర్ణ అనారోగ్యంగా ఉండటంతో అనుమతి తీసుకొనే పనికి రాకుంటే వివిధ కారణాలు చూపుతూ దుర్భాషలాడి పనిలో నుంచి తీసివేసారని, ఇట్టి అధికారిపై చర్యలు తీసుకొని ఎస్సీ, ఎస్టీ కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. కార్మికులకు కనీస వేతనం అమలు చేయాలని పని భద్రత కల్పించాలన్నారు. రాజకీయ మెప్పు పొందేందుకు కొందరు అధికారులు, కార్మికులను ఇబ్బందులు పెడుతున్నారని అలాంటి వారిపై చర్యలు తీసుకొని తొలిగించిన వారిని వెంటనే పనిలోకి తీసుకోవాలని లేని పక్షంలో కేవీపీఎస్ ఆద్వర్యంలో పోరాటం చేస్తామని హెచ్చరించారు. ఈ సమావేశంలో కేవీపీఎస్ జిల్లా అధ్యక్షుడు ఓరుగంటి సాంబయ్య, జిల్లా మాజీ అధ్యక్షుడు మంద మల్లేశం, జిల్లా నాయకులు ఐత మారుతి, ఒంటెల పాపయ్య, జంపాల రమేష్ పాల్గొన్నారు.

# దాతల చేయూతను సద్వినియోగం చేసుకోవాలి : అచ్యుత శర్మ

నల్గొండ, సెప్టెంబర్ 20: దాతలు అందించిన చేయూతను సద్వినియోగం చేసుకుని ఉన్నత స్థానాలకు ఎదగాలని సుధాకర్ పీవీసీ మేనేజర్ అచ్యుత శర్మ అన్నారు. శనివారం అర్వపల్లి మండల పరిధిలోని తిమ్మాపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు సుధాకర్ పీవీసీ అధినేత మీలా మహదేవ్ అందించిన ఫర్నిచర్‌ను ఆయన పాఠశాలకు బహుకరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. గ్రామీణ ప్రాంత విద్యార్థులు ఆహ్లాదకరమైన వాతావరణంలో విద్యనభ్యసించేలా చేయూత అందిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు కుంభం ప్రభాకర్, విశ్రాంత రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత గుండా రమేశ్, వర్దెల్లి కృష్ణయ్య, నర్సయ్య, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# మెడికల్ సీటు సాధించిన రైతు బిడ్డ.. అభినందించిన గ్రామస్థులు

నిర్మల్ సెప్టెంబర్ 20: నిర్మల్ జిల్లా కుభీర్ మండలం పల్సి గ్రామానికి చెందిన కుబ్రే నర్సవ్వ, హన్మాండ్లు కూతురు అపర్ణ అనే విద్యార్థిని నీట్ పరీక్షలో మంచి 504 ర్యాంక్ సాధించి వరంగల్‌లోని కాకతీయ మెడికల్ కాలేజీలో ఎంబీబీఎస్ సీటును పొందింది. గ్రామం నుంచి ఎంబీబీఎస్‌కు ఎంపికైనమొట్ట మొదటి విద్యార్థిని అపర్ణ కావడం విశేషం. ఆమె తల్లిదండ్రులు వ్యవసాయంపై ఆదారపడి జీవిస్తున్న కుటుంబం.

ఈ సంద్భంగా గ్రామం నుంచి మెడికల్ సీటు సాధించిన మొదటి విద్యార్థిని అపర్ణను ఉపాధ్యాయులు, గ్రామస్థులు శనివారం ఘనంగా సన్మానించారు. నాలుగో తరగతి వరకు పల్సి ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో, ఐదు నుంచి ఇంటర్ వరకు ఇచ్చోడలోని ప్రభుత్వ గురుకుల బాలికల పాఠశాలలో చదివిన ఆమెను మెడికల్ సీట్ సాధించడం అభినందనీయమని , గ్రామంలోని మిగతా విద్యార్థులకు ఆదర్శమని కొనియాడారు. ఈ సంద్భంగా ఆమెను శాలువాలతో సత్కరించి అభినందించారు.

# నల్లగొండ జిల్లా ఎంపీడీఓల సంఘం అధ్యక్షుడిగా యాకూబ్ నాయక్

నల్లగొండ సెప్టెంబర్ 20 : మండల పరిషత్ అభివృద్ధి అధికారుల సంఘం నల్లగొండ జిల్లా అధ్యక్షుడిగా నల్లగొండ మండల ఎంపీడీఓ యాకుబ్ నాయక్ ఎన్నికయ్యారు. శనివారం జిల్లా కేంద్రంలోని సంఘ భవనంలో ఎన్నికలు నిర్వహించారు. జడ్పీ సీఈఓ శ్రీనివాసరావు ఎన్నికల అధికారిగా వ్యవహరించగా ఎంపీడీఓల సంఘం కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా యాకూబ్ నాయక్ తో పాటు ప్రధాన కార్యదర్శిగా చందూరు ఎంపీడీఓ బి.యాదగిరిని ఎన్నుకున్నారు.

# అత్యంత పవిత్రమైన, అమూల్యమైన శ్రీ గురు గోవింద్ సింగ్, మాతా సాహిబ్ కౌర్‌ల 'జోరే సాహిబ్'

న్యూఢిల్లీ, సెప్టెంబర్ 20:సిక్కు ప్రతినిధుల బృందంతో ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ ఈ రోజు సమావేశమయ్యారు. అత్యంత పవిత్రమైన, అమూల్యమైన శ్రీ గురు గోవింద సింగ్, మాతా సాహిబ్ కౌర్‌ల 'జోరే సాహిబ్' సంరక్షణ, ప్రదర్శనపై ప్రతినిధులు అందించిన సూచనలను పరిగణనలోకి తీసుకున్నారు. 'జోరే సాహిబ్' వంటి పవిత్ర స్మృతి చిహ్నాలు ఆధ్యాత్మికంగా ఎంతో ముఖ్యమైనవనీ, విశేషమైన సిక్కు చరిత్రలో ఒక భాగమనీ, దేశ సంస్కృతికి మూలాలనీ పేర్కొన్నారు. "శ్రీ గురు గోవింద్ సింగ్ చూపిన ధైర్యం, ధర్మం, న్యాయం, సామాజిక సామరస్య మార్గాన్ని అనుసరించేలా భవిష్యత్ తరాలకు పవిత్రమైన ఈ స్మృతి చిహ్నాలు స్ఫూర్తినిస్తాయి'' అని శ్రీ మోదీ అన్నారు.

"శ్రీ గురు గోవింద్ సింగ్, మాతా సాహిబ్ కౌర్‌లకు చెందిన అత్యంత పవిత్రమైన, అమూల్యమైన 'జోరే సాహిబ్'ను సంరక్షించడానికి, ప్రదర్శించడానికి సిక్కు ప్రతినిధుల బృందం చేసిన విలువైన సూచనలను సంతోషంగా స్వీకరిస్తున్నాను.

సిక్కు చరిత్రలో 'జోరే సాహిబ్' పవిత్రమైన స్మృతి చిహ్నాలు ఆధ్యాత్మికంగా ఎంతో ముఖ్యమైనవి. దేశ సాంస్కృతిక మూలాల్లో ఇవి భాగంగా ఉన్నాయి. శ్రీ గురు గోవింద్ సింగ్ చూపిన ధైర్యం, ధర్మం, న్యాయం, సామాజిక సామరస్య మార్గాన్ని అనుసరించేలా భవిష్యత్ తరాలకు ఈ పవిత్ర స్మృతి చిహ్నాలు స్ఫూర్తినిస్తాయి"

# ఘరానా దొంగలు ముగ్గురు అరెస్ట్ : ఏసీపీ తిరుపతిరెడ్డి




ఖమ్మం, సెప్టెంబర్ 20: ఖమ్మం జిల్లాలోని పలు ప్రాంతాలు, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో సైతం వరుస దొంగతనాలకు పాల్పడుతున్న ముగ్గురు దొంగలను ఖమ్మం సిసిఎస్, ఖమ్మం రూరల్ రఘునాథపాలెం పోలీస్ స్టేషన్ సిబ్బంది చాకచక్యంగా పట్టుకున్నారు. శనివారం ఖమ్మం రూరల్ ఏసీపీ కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో రూరల్ సీఐ ముష్కరాజ్, సీసీఎస్ ఎస్ఐ శ్రీనివాస్‌తో కలిసి ఖమ్మం రూరల్ ఏసీపీ తిరుపతిరెడ్డి వివరాలు వెల్లడించారు. రఘునాథపాలెం మండలం రేగులచర్ల గ్రామానికి చెందిన జంగా వెంకన్న, అదే గ్రామానికి చెందిన వెల్లబోయిన లక్ష్మణరావు, కొత్తగూడెం జిల్లా ఎదురుగడ్డ ప్రాంతానికి చెందిన పల్లపు సంపత్తులు ఓ ముఠాగా ఏర్పడి గత కొంతకాలంగా వరుస దొంగతనాలకు పాల్పడుతున్నారు. సిసిఎస్ సివిల్ పోలీసులు జాయింట్ ఆపరేషన్ చేసి చాకచక్యంగా వీరిని అదుపులోకి తీసుకున్నట్లు ఏసీపీ తెలిపారు.

వారిని విచారించగా ఖమ్మం రూరల్ మండలం కామంచికల్, గొల్లగూడెం, మద్దులపల్లి గ్రామాల్లో దొంగతనాలకు పాల్పడి బంగారు ఆభరణాలను చోరీ చేసినట్లు తెలిపారు. అదేవిధంగా నేలకొండపల్లి, కానాపురం, రఘునాథపాలెం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా సుజాతనగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో సైతం పలు దొంగతనాలకు పాల్పడినట్లు వెల్లడించారు. నిందితుల వద్ద నుండి 190 గ్రాముల బంగారం సుమారు 20 లక్షల విలువ గల ఆభరణాలను రికవరీ చేసినట్లు చెప్పారు. వారిని జిల్లా కోర్టులో హాజరు పరచడం జరిగిందన్నారు. కేసును విజయవంతంగా చేధించిన ఖమ్మం రూరల్ పోలీస్ స్టేషన్ పోలీస్ కానిస్టేబుల్ శ్రీనివాస్, దశరథ, నాగేంద్రప్రసాద్, రఘునాథపాలెం పోలీస్ స్టేషన్ పీసీ సంజీవ్ కుమార్, సిసిఎస్ కు చెందిన సీసీలు హరికృష్ణ, నరసింహారావు, సుధీర్, సంజీవ్, జానీ పాషా, మంగ్యలను ఏసీపీ అభినందించారు.

# దివ్యాంగులకు రూ.6 వేలు పింఛన్ ఇవ్వాలని ఎమ్మార్వోకు వినతిపత్రం

అమరావతి, సెప్టెంబర్ 20:కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు దివ్యాంగులకు రూ. 6 వేలు పింఛన్ ఇవ్వాలని దివ్యాంగుల హక్కుల జాతీయ వేదిక సంఘం మండల అధ్యక్షులు బాబు కోరారు. ఈ మేరకు శనివారం తహసీల్దార్ సురేష్ కు వినతిపత్రం అందజేశారు. ప్రభుత్వం ఏర్పడి 21 నెలలు గడిచినా దివ్యాంగులకు రూ. 6వేలు పెన్షన్ పెంచుతామని హామీ ఇప్పటివరకు నెరవేర లేదని ఆరోపించారు.

ప్రజాపాలనలో దరఖాస్తులు చేసుకున్న దివ్యాంగులకు ఇప్పటివరకు కొత్త పింఛన్లు మంజూరు చేయలేదని పేర్కొన్నారు. పెండింగ్‌లో ఉన్న పింఛన్లు వచ్చే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మండల కార్యదర్శి రవికుమార్, సభ్యులు లంగటి అబ్బయ్య, నగరం నరసింహులు, ఈడిగి సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

# ఇచ్చిన హామీ మేరకు పింఛన్లు పెంచాలి




నల్గొండ, సెప్టెంబర్ 20: గత అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా కాంగ్రెస్ ఇచ్చిన హామీ ప్రకారం ప్రభుత్వం ఆసరా పింఛన్లను పెంచాలని డిమాండ్ చేస్తూ పెన్‌పహాడ్ మండలంలో వివిధ గ్రామాల్లో పంచాయతీ కార్యదర్శులకు పింఛన్‌దారులు శనివారం వినతి పత్రాలు అందజేశారు. మందకృష్ణ మాదిగ ఆదేశానుసారం వికలాంగుల పింఛన్ పెంచాలని డిమాండ్ చేస్తూ అనంతారం, పొట్లపాడు గ్రామ పంచాయతీ కార్యాలయాలను దివ్యాంగులు ముట్టడించారు. గత 20 నెలలుగా పింఛన్లు పెంచకుండా కాంగ్రెస్ ప్రభుత్వం కాలయాపన చేస్తూ వస్తుందన్నారు. ఇచ్చిన మాట ప్రకారం దివ్యాంగులకు రూ.6 వేలు, ఇతర పింఛన్లను రూ.4 వేలకు పెంచాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో వికలాంగుల పోరాట సమితి గ్రామ శాఖ అధ్యక్షుడు కోమటిరెడ్డి కృష్ణారెడ్డి, ఎంఆర్‌పిఎస్ మండలాధ్యక్షుడు కొండేటి గోపి మాదిగ, మామిడి

# బీఆర్ఏయూలో అడ్మిషన్ల గడువు 26 వరకు పొడిగింపు : డాక్టర్ బి.ధర్మానాయక్




నల్గొండ, సెప్టెంబర్ 20:డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయంలో ఈ విద్యా సంవత్సరానికి డిగ్రీ, పీజీ కోర్సుల్లో చేరేందుకు విద్యార్థుల నుంచి అపూర్వమైన స్పందన వస్తుందని, వారి కోరిక మేరకు అడ్మిషన్ల ప్రక్రియ గడువు ఈ నెల 26వ తేదీ వరకు పెంచడం జరిగిందని యూనివర్సిటీ జాయింట్ డైరెక్టర్ డాక్టర్ బి.ధర్మానాయక్ తెలిపారు. నల్లగొండలోని యూనివర్సిటీ రీజినల్ సెంటర్ లో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గతంలో ఎన్నడూ లేని విధంగా స్టైఫండ్ ఆధారిత విద్యా కార్యక్రమం ద్వారా అండర్ గ్రాడ్యుయేట్ విద్యార్థులను అప్రెంటిస్షిప్ ల చదువుతో పాటు, గ్రామీణ గిరిజన విద్యార్థులకు స్వల్పకాలిక వృత్తి విద్యా కోర్సులను కూడా స్వామి రామానంద తీర్థ రూరల్ ఇనిస్టిట్యూట్ ద్వారా ప్రతి సంవత్సరం 5 వేల మంది గ్రామీణ గిరిజన విద్యార్థులకు ఈ కోర్సులను అందుబాటులోకి తీసుకురావడం జరిగిందన్నారు.

అంతేకాకుండా తెలంగాణలోని గోండు కోయ, చెంచు ఆదివాసులు, దివ్యాంగులు, ట్రాన్స్ జెండర్లు ఎలాంటి ఫీజు లేకుండా ఉన్నత చదువులు చదువుకునే అవకాశం విశ్వవిద్యాలయం అందుబాటులోకి తీసుకొచ్చిందని తెలిపారు. ఈ సమావేశంలో రీజినల్ కో ఆర్డినేటర్ డాక్టర్ బొజ్జ అనిల్ కుమార్, ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల దూర విద్య కో ఆర్డినేటర్ డాక్టర్ సుంకరి రాజారామ్, కౌన్సిలర్లు, పున్న అంజయ్య, శ్రీకాంత్, మహేష్ పాల్గొన్నారు.

# భారీ గుమ్మడికాయను పండించిన రైతు.. బరువు ఏకంగా 969 కిలోలు..!

హైదరాబాద్, సెప్టెంబర్ 20:సాధారణంగా గుమ్మడికాయలు మూడు, నాలుగు కిలోల బరువు ఉంటాయి. మహా అయితే కొన్ని గుమ్మడికాయలు 10 కిలోల బరువు తూగుతాయి. అత్యంత అరుదుగా కొన్ని గుమ్మడి కాయలు సుమారుగా 20 కిలోల వరకు బరువు పెరగవచ్చు. కానీ ఆ రైతు పండించిన గుమ్మడి కాయ మాత్రం ఏకంగా 969 కిలోల బరువు ఉంది. అతిపెద్ద గుమ్మడికాయను పండించిన రైతుగా ఆయన రికార్డు సృష్టించాడు.

వివరాల్లోకి వెళ్తే.. రష్యాకు చెందిన అలెగ్జాండర్ చుసోవ్ అనే రైతు అతిపెద్ద గుమ్మడికాయను పండించి రికార్డు నెలకొల్పాడు. మాస్కోలో జరిగిన భారీ కూరగాయల పోటీల్లో ఆ భారీ గుమ్మడికాయను ప్రదర్శించారు. దాని బరువు ఏకంగా 969 కిలోలు ఉంది. దాంతో అది రష్యాలోనే అతిపెద్ద గుమ్మడికాయగా రికార్డుల్లోకి ఎక్కింది.

ఆ భారీ గుమ్మడి కాయను పండించేందుకు ఆరు నెలల కంటే ఎక్కువ సమయం పట్టిందని రైతు చుసోవ్ వెల్లడించారు. నేల, గాలిని వేడిచేసే ప్రత్యేక గ్రీన్ హౌస్‌ను నిర్మించి అందులో జాగ్రత్తగా దీన్ని పండించినట్లు చెప్పారు. ఎరువులు, నీటిని కచ్చితమైన మోతాదులో అందించినట్లు వివరించారు. ఈ పోటీల్లో దాదాపు మూడు వేల మందికిపైగా రైతులు పాల్గొన్నారని నిర్వాహకులు తెలిపారు. కాగా పోటీల్లో 144 కేజీల బరువున్న పుచ్చకాయ ప్రత్యేక ఆకర్షణగా నిలిచిందని నిర్వాహకులు వెల్లడించారు.

# భావ్‌నగర్‌లో రూ. 34,200 కోట్లకు పైగా విలువైన పలు అభివృద్ధి ప్రాజెక్టుల ప్రారంభం

న్యూఢిల్లీ, సెప్టెంబర్ 20:ప్రధాన మంత్రి శ్రీ నరేంద్ర మోదీ రేపు గుజరాత్‌లో పర్యటిస్తారు. ఉదయం 10:30 గంటలకు భావ్‌నగర్‌లో 'సముద్ర సే సమృద్ధి' కార్యక్రమంలో ఆయన పాల్గొంటారు. రూ. 34,200 కోట్లకు పైగా విలువైన పలు అభివృద్ధి ప్రాజెక్టులను ప్రారంభించి, శంకుస్థాపన చేస్తారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసే సభను ఉద్దేశించి ప్రధాన మంత్రి ప్రసంగిస్తారు.

ఆ తరువాత ఏరియల్ సర్వే ద్వారా ధోలేరాను ప్రధానమంత్రి పరిశీలిస్తారు. మధ్యాహ్నం 1:30 గంటలకు ఆయన అధ్యక్షతన సమీక్షా సమావేశం నిర్వహిస్తారు. అనంతరం లోథాల్‌లోని నేషనల్ మారిటైమ్ హెరిటేజ్ కాంప్లెక్స్‌ను ప్రధానమంత్రి సందర్శిస్తారు.

సముద్ర రంగానికి ఊతమిచ్చే రూ.7,870 కోట్లకు పైగా విలువైన పలు అభివృద్ధి ప్రాజెక్టులను ప్రధానమంత్రి ప్రారంభించి, శంకుస్థాపన చేస్తారు. ఇందిరా డాక్‌లో ముంబయి ఇంటర్నేషనల్ క్రూయిజ్ టెర్మినల్‌నూ ఆయన ప్రారంభిస్తారు. కోల్‌కతాలోని శ్యామా ప్రసాద్ ముఖర్జీ పోర్టులో కొత్త కంటైనర్ టెర్మినల్, అనుబంధ కేంద్రాలు.. పరదీప్ పోర్టులో కొత్త కంటైనర్ బెర్త్, కార్గో హ్యాండ్లింగ్ కేంద్రాలు, సంబంధిత అభివృద్ధి పనులు.. ట్యూనా టెక్రా మల్టీ-కార్గో టెర్మినల్.. ఎన్నోర్‌లోని కామరాజర్ పోర్టులో అగ్నిమాపక కేంద్రాలు, ఆధునిక రహదారి కనెక్టివిటీ పనులు.. చెన్నై పోర్టులో సీవాల్స్, రివెట్‌మెంట్లు సహా తీరప్రాంత రక్షణ పనులు.. కార్ నికోబార్ ద్వీపంలో సీవాల్ నిర్మాణం.. కాండ్లాలోని దీన్‌దయాళ్ పోర్టులో బహుళ ప్రయోజన కార్గో బెర్త్, గ్రీన్ బయో-మిథనాల్ ప్లాంట్.. పాట్నా, వారణాసి ఓడల మరమ్మతు కేంద్రాలకు ప్రధానమంత్రి శంకుస్థాపన చేస్తారు.

సమగ్ర, సుస్థిర అభివృద్ధి పట్ల తన నిబద్ధతకు అనుగుణంగా.. ప్రధాన మంత్రి గుజరాత్‌లోని వివిధ రంగాలకు చెందిన రూ.26,354 కోట్లకు పైగా విలువైన కేంద్ర-రాష్ట్ర ప్రభుత్వాల పలు ప్రాజెక్టులను ప్రారంభించి, శంకుస్థాపన చేస్తారు. ఛరా పోర్టులో హెచ్‌పీఎల్ఎన్‌జీ రీగ్యాసిఫికేషన్ టెర్మినల్, గుజరాత్ ఐవోసీఎల్ రిఫైనరీలో యాక్రిలిక్స్, ఆక్సో ఆల్కహాల్ ప్రాజెక్ట్, 600 మెగావాట్ల గ్రీన్ షూ ఇనిషియేటివ్, రైతుల కోసం పీఎమ్-కుసుమ్ 475 మెగావాట్ల కాంపోనెంట్ సి సోలార్ ఫీడర్, 45 మెగావాట్ల బదేలి సోలార్ పీవీ ప్రాజెక్ట్, ధోర్డో గ్రామ సంపూర్ణ సౌర విద్యుదీకరణ మొదలైన పనులను ఆయన ప్రారంభిస్తారు. భావ్‌నగర్‌లోని సర్ టీ. జనరల్ హాస్పిటల్, జామ్‌నగర్‌లోని గురు గోవింద్ సిన్హ్ ప్రభుత్వ ఆసుపత్రి విస్తరణ పనులు, 70 కిలోమీటర్ల జాతీయ రహదారిని నాలుగు వరుసలుగా విస్తరణ పనులు సహా ఎల్ఎన్ జీ మౌలిక సదుపాయాలు, అదనపు పునరుత్పాదక ఇంధన ప్రాజెక్టులు, తీరప్రాంత రక్షణ పనులు, రహదారులు, ఆరోగ్య సంరక్షణ, పట్టణ రవాణా ప్రాజెక్టులకు ఆయన శంకుస్థాపన చేస్తారు. సుస్థిర పారిశ్రామికీకరణ, స్మార్ట్ మౌలిక సదుపాయాలు, ప్రపంచ పెట్టుబడులు లక్ష్యంగా నిర్మించిన గ్రీన్‌ఫీల్డ్ పారిశ్రామిక నగరంగా భావించే ధోలేరా స్పెషల్ ఇన్వెస్ట్‌మెంట్ రీజియన్ (డీఎస్ఐఆర్) ను ఏరియల్ సర్వే ద్వారా పరిశీలిస్తారు. భారత ప్రాచీన సముద్ర సంప్రదాయాల సంరక్షణ, పర్యాటకం, పరిశోధన, విద్య, నైపుణ్యాభివృద్ధి కేంద్రంగా లోథాల్‌లో దాదాపు రూ.4,500 కోట్ల వ్యయంతో అభివృద్ధి చేస్తున్న నేషనల్ మారిటైమ్ హెరిటేజ్ కాంప్లెక్స్ (ఎన్‌హెచ్ఎమ్‌సీ) పురోగతిని ప్రధానమంత్రి సమీక్షిస్తారు.

# ఎండు గంజాయి, ఆల్ప్రాజోలం, ఎండీఎంఏ దహనం : ఎస్పీ పరితోష్ పంకజ్



మెదక్, సెప్టెంబర్ 20:సంగారెడ్డి జిల్లాలో వివిధ పోలీస్ స్టేషన్లలో ఎన్డీపీఎస్ చట్ట ప్రకారం నమోదైన 20 కేసులలో సీజ్ చేయబడిన ప్రభుత్వ నిషేధిత 583 కిలోల ఎండు గంజాయి, 1.777 కిలోల ఆల్ప్రాజోలం, 980 గ్రాముల ఎండీఎంఏ డ్రగ్‌ను చట్ట ప్రకారం కోర్టు అనుమతి తీసుకుని, జిల్లా డ్రగ్ డిస్పోజల్ కమిటీ ఆధ్వర్యంలో పాశమైలారం పారిశ్రామిక వాడల్లోని మెడికేర్ పరిశ్రమలో ఇన్సినిరేషన్ ప్రక్రియ ద్వారా పర్యావరణ కాలుష్య నియంత్రణ నిబంధనలను పాటిస్తూ దహనం చేయడం జరిగిందని జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్ తెలిపారు.

శనివారం పటాన్‌చెరు మండలంలోని పాశమైలారం పారిశ్రామిక వాడలో దహనం చేశారు. ఎన్డీపీఎస్ యాక్ట్‌లోని నియమ నిబంధనల ప్రకారం జిల్లాలోని పలు పోలీస్ స్టేషన్లలో నిల్వ ఉన్న ప్రభుత్వ నిషేధిత ఎండు గంజాయి, ఆల్ప్రాజోలం, ఎండీఎంఏను ఈ రోజు దహనం చేయడం జరిగిందని అన్నారు. కొందరు అక్రమార్జనలో భాగంగా అక్రమ ఆల్ప్రాజోలం తయారీ, గంజాయి సాగు, విక్రయిస్తూ పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లోని యువతను ప్రలోభాలకు గురి చేస్తూ మత్తులోకి లాగుతున్నారని అన్నారు.

సంగారెడ్డి జిల్లాలో అసాంఘిక, చట్ట వ్యతిరేక కార్యకలాపాలను అరికట్టడానికి స్పెషల్ టాస్క్ ఫోర్స్ టీంలను ఏర్పాటు చేయడం జరిగిందని, ఈ టీమ్స్ జిల్లా వ్యాప్తంగా విస్తృత స్థాయిలో తనిఖీలు నిర్వహిస్తూ దాడులు చేపట్టడం జరిగిందని అన్నారు. జిల్లాలో ఎవరైనా గంజాయి, ఇతర మత్తు పదార్థాలను విక్రయించి, సరఫరా చేసినా లేదా సాగు చేసిన కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

ఈ డ్రగ్ డిస్పోజల్ కార్యక్రమంలో సంగారెడ్డి డీఎస్పీ సత్యయ్యగౌడ్, పటాన్ చెరువు డీఎస్పీ ప్రభాకర్, వర్టికల్ డీఎస్పీ సురేందర్ రెడ్డి, మెడికేర్ ఎన్విరాన్‌మెంటల్ పరిశ్రమ మేనేజర్ శివారెడ్డి, డీసీఆర్బీ ఇన్‌స్పెక్టర్ బి రమేష్, ఎస్ న్యాబ్ ఇన్‌స్పెక్టర్ నాగేశ్వర్ రావ్, పటాన్ చెర్వు ఇన్‌స్పెక్టర్ వినాయక్ రెడ్డి, భానూర్ ఇన్‌స్పెక్టర్ విజయ్ కృష్ణ, సంబంధిత ఎస్‌హెచ్ఓలు ఉన్నారు.

# 'ప్రత్యేక ప్రచార ఉద్యమం 5.0'ని విజయవంతంగా అమలు చేయడానికి పూర్తి స్థాయిలో సిద్ధమైన భారతీయ రైల్వే

న్యూఢిల్లీ, సెప్టెంబర్ 20:అన్ని సంస్థలూ స్వచ్ఛతను తప్పక పాటించడంతో పాటు పరిష్కరించకుండా మిగిలి ఉన్న పనులను పూర్తి చేసే లక్ష్యంతో 'ప్రత్యేక ప్రచార ఉద్యమం 5.0' ను కేంద్ర ప్రభుత్వం ఈ నెల 15న ఆరంభించింది. లక్ష్యాలను నిర్దేశించుకోవడం, వాటిని ఈ సంవత్సరం అక్టోబరు 2 నుంచి 31 మధ్య నెరవేర్చడం ఈ ప్రచార ఉద్యమ ధ్యేయాలు. ఈ ప్రచార ఉద్యమాన్ని భారతీయ రైల్వే అంతటా ఫలప్రదంగా అమలు చేయడానికి రైల్వే శాఖ అన్ని విధాలుగానూ సన్నద్ధమైంది.

ప్రచార ఉద్యమాన్ని రైల్వే బోర్డు చైర్మన్, ముఖ్య కార్యనిర్వహణ అధికారి శ్రీ సతీష్ కుమార్ నాయకత్వంతో పాటు ఇతర ఉన్నతాధికారుల సాయంతో ప్రభావవంతంగా అమలుచేయడానికి సంబంధించిన సన్నాహాలను బోర్డు పర్యవేక్షిస్తోంది. ఈ విషయంలో జనరల్ మేనేజర్లకు, ఇతర యూనిట్ల అధిపతులకు ఒక డి.ఒ. లేఖను పంపుతూ, క్షేత్ర విభాగాలన్నింటికీ సమగ్ర మార్గదర్శకాలను సూచించారు. ప్రచార ఉద్యమ నోడల్ అధికారులందరితో కిందటి నెల 27న ఒక సమీక్షా సమావేశాన్ని రైల్వే బోర్డు కార్యదర్శి అధ్యక్షతన నిర్వహించారు.

పదిహేడు జోనల్ రైల్వేలు, 70 డివిజనల్ కార్యాలయాలు, 10 ప్రభుత్వ రంగ సంస్థలు (పీఎస్‌యూలు), 9 ప్రొడక్షన్ యూనిట్లు (పీయూల)తో పాటు 9 కేంద్రీయ శిక్షణ సంస్థలన్నీ ప్రచార ఉద్యమంలో చ ం ం క ం గా పాలుపంచుకోవాల్సిందంటూ ఆదేశాలను జారీ చేశారు. దీనికి సంబంధించిన ప్రయత్నాలను సమన్వయం చేసే బాధ్యతను 150 కన్నా ఎక్కువ మంది నోడల్ అధికారులకు అప్పగించారు. రియల్ టైమ్ కమ్యూనికేషన్‌తో పాటు ఎప్పటికప్పుడు తాజా సమాచారాన్ని ఇవ్వడానికి ఒక ప్రత్యేక వాట్సాప్ గ్రూపును ఏర్పాటు చేశారు.

ప్రస్తుతం సన్నాహక దశ కొనసాగుతోంది. ప్రచార ఉద్యమంలో ముఖ్య అంశాలకు సంబంధించి లక్ష్యాలకు తుది రూపును ఇస్తున్నారు. పరిష్కారం కాకుండా మిగిలి ఉన్న పనులను గుర్తించి వాటిని పూర్తి చేయడం, ఫైళ్లను సమీక్షించడం, స్వచ్ఛత పరిరక్షణ కార్యక్రమాలు చేపట్టడం, ఎలక్ట్రానిక్ వ్యర్థాల నిర్వహణ, తుక్కును వదిలించుకోవడం ఈ ముఖ్య అంశాల్లో కొన్ని.

స్వచ్ఛతను కాపాడడాన్ని రోజువారీ చేపట్టాల్సిన సంస్థాగత అభ్యాసంగా మార్చడానికి, పెండింగు పనులన్నింటిని సమయానికి తగ్గట్టు పరిష్కరిస్తుండడానికి రైల్వే శాఖ పూర్తి స్థాయి నిబద్ధతను కనబరుస్తోంది. అన్ని విభాగాల్లో ప్రణాళికాబద్ధ సమన్వయాన్ని ఏర్పరుచుకొని, అన్ని యూనిట్లు అంకిత భావంతో భాగం పంచుకొనేటట్లు చూస్తూ 'ప్రత్యేక ప్రచార ఉద్యమం 5.0'ను గొప్పగా విజయవంతం చేయాలని మంత్రిత్వ శాఖ లక్ష్యంగా పెట్టుకొంది.

# ఏపీలో 9 మంది ఐఏఎస్ అధికారుల బదిలీ

అమరావతి, సెప్టెంబర్ 20: ఏపీలో మరో 9 మంది ఐఏఎస్ అధికారులు బదిలీ అయ్యారు. ఈ మేరకు శనివారం సాయంత్రం ప్రభుత్వం బదిలీ ఉత్తర్వులను విడుదల చేసింది. ఏపీ జెన్‌కో ఎండీగా ఐఏఎస్ అధికారిణి ఎస్ నాగలక్ష్మిని నియమించారు. స్టాంప్స్, రిజిస్ట్రేషన్ల శాఖ ఐజీగా బీఆర్ అంబేద్కర్ , ఎక్సైజ్ అండ్ ప్రొహిబిషన్ శాఖ డైరెక్టర్‌గా చామకూరి శ్రీధర్, పట్టణాభివృద్ధి శాఖ అదనపు కమిషనర్‌గా అమిలినేని భార్గవ్ తేజను నియమించారు.

కృష్ణ జిల్లా జేసీగా మల్లారపు నవీన్, నెల్లూరు జిల్లా జేసీగా మొగిలి వెంకటేశ్వర్లు , రాష్ట్ర ఖాదీ బోర్డు సీఈవోగా కట్టా సింహాచలంను నియమించారు. రీహాబిలిటేషన్, రీసెటిల్‌మెంట్ డైరెక్టర్‌గా పి. ప్రశాంతి,రాష్ట్ర ఎన్నికల సంఘం కార్యదర్శిగా ఎ.మల్లికార్జునను ప్రభుత్వం నియమించింది.

# స్మార్ట్ కిడ్జ్‌లో అంబరాన్నంటిన బతుకమ్మ పూల సంబురం

## – చప్పట్లతో,కోలాట నృత్యాలతో ఆడి పాడిన విద్యార్థులు

## – తెలంగాణ పూల పండుగ బతుకమ్మలతో చిన్నారుల సందడి



ఖమ్మం, సెప్టెంబర్ 20 (నేటినిజం ప్రతినిధి) : పూలను దేవతగా భావించి పూజలు అందించే బతుకమ్మ పండుగ సంబరాలు స్థానిక స్మార్ట్ కిడ్జ్ పాఠశాలలో శనివారం చిన్నారుల ఆనందోత్సవాలతో ఘనంగా నిర్వహించారు. పాఠశాల చిన్నారులంతా సాంప్రదాయ వస్త్రధారణలో బతుకమ్మ వేడుకలలో హుషారుగా పాల్గొన్నారు. బతుకమ్మలను పలురకాల పూలతో అందంగా పేర్చి తమ తమ ఇళ్ల నుంచి ప్రత్యేక వస్త్రధారణలతో పాఠశాలకు చేరుకొని బతుకమ్మలను ఉంచి వలయాకారంగా చప్పట్ల తాళాలతో, బతుకమ్మ గేయాలతో ఉత్సాహంగా పూల సంబురాలు నిర్వహించారు. తెలంగాణ ప్రాంతానికి ప్రత్యేకంగా పరిమితమైన ఈ సంబురాలను పాఠశాలలో అంబరాన్ని అంటేలా నిర్వహించారు. కోలాటం నృత్యాలతో పాఠశాలలో హోరెత్తించారు. ఔషధ గుణాలు కలిగిన పూలను అందంగా, నేర్పుగా బతుకమ్మలను పేర్చడంతో పాఠశాల చిన్నారులు ఆనందోత్సవాలతో వేడుకలలో మురిసిపోయారు. ఈ సందర్భంగా పాఠశాల కరస్పాండెంట్ చింతనిప్పు కృష్ణ చైతన్య మాట్లాడుతూ...అనాదికాలంగా తెలంగాణ గౌరవ ప్రతిష్టలను బతుకమ్మ సంబురాలు ఇనుమడింప చేస్తున్నాయని పేర్కొన్నారు. ఆడపడుచుల, చెరువుల పండగగా బతకమ్మ వేడుకలను ప్రకృతి రమణీయతతో ఈ ఉత్సవాలను ఇంటింటా నిర్వహించుకునే పూల సంబురం తెలంగాణ ఖ్యాతిని దశదిశలా చాటి చెబుతున్నదని తెలిపారు. ఔషధ గుణాలున్న పూలతో ఎంగిలిపూల బతుకమ్మతో మొదలుకొని సద్దుల బతుకమ్మ దాకా తొమ్మిది రోజులపాటు పలు రకాల ఫలహారాలతో ఒకరికొకరు ఆత్మీయంగా,సమైక్యంగా ఉంటూ తమ ఆనందాలను పంచుకునే ప్రత్యేక సంబరాలు బతుకమ్మ వేడుకలలో అందరినీ ఉత్సాహంగా ఉంచుతున్నాయన్నారు. తమ పాఠశాలలో తెలంగాణ ప్రత్యేక సంబురం బతుకమ్మ వేడుకలను నిర్వహించడం ద్వారా మన తెలంగాణ సంస్కృతి, సాంప్రదాయాలను పాఠశాల విద్యార్థులకు తెలియజేస్తున్నామని వివరించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్ చింతనిప్పు సుకన్య, ప్రిన్సిపల్, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# ఎక్కువ సంఖ్యలో మహిళా పోలీసులను నియమించాలి..

## – బతుకమ్మ ఏర్పాట్లపై కలెక్టర్ స్నేహ శబరీష్



వరంగల్, సెప్టెంబర్ 20: చారిత్రక రుద్రేశ్వరస్వామి వేయిస్తంభాల దేవాలయంలో ఈ 21న బతుకమ్మ వేడుకలు నిర్వహించనున్నారు. శనివారం వేయి స్తంభాల దేవాలయ ప్రాంగణంలో జరిగే బతుకమ్మ ఏర్పాట్లను హనుమకొండ జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్, మున్సిపల్ కమిషనర్ చాహత్ వాజ్‌పేయి, మున్సిపల్ అధికారులు, విద్యుత్ అధికారులు, రెవెన్యూ అధికారులు, ఆర్డీఓ, ఎమ్మార్వో, సిటీ డీసీపీ సలీమా, ఏసీపీ నరసింహారావు, ట్రాఫిక్ ఏసీపీ సత్యనారాయణ, హనుమకొండ సీఐ మచ్చ శివకుమార్, ట్రాఫిక్ సీఐ సీతారెడ్డి, కేంద్ర పురావస్తుశాఖ సీఏ అజిత్, దేవాలయ కార్యనిర్వాహణ అధికారి డి.అనిల్ కుమార్, ఆలయ ప్రధానార్చకుడు గంగు ఉపేందర్‌శర్మ, టూరిజం శాఖ జిల్లా అధికారి శివాజీతో కలిసి కలెక్టర్ దేవాలయ ప్రాంగణమంతా పరిశీలించారు.

తగిన ఏర్పాట్లు చేయాలని, దేవాలయానికి తరలివచ్చే మహిళలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా తూర్పు గేట్ నుంచి బ్యారగేట్స్ ఏర్పాటు చేయాలని ఆ బ్యారగేట్ల ద్వారానే వీఐపీలను మంత్రులను తీసుకురావాలన్నారు. దేవాలయ దర్శనం అనంతరం స్టేజీపైకి స్వాగతించాలని అధికారులను కలెక్టర్ స్నేహ శబరీష్ ఆదేశించారు. వీఐపీలు బతుకమ్మ ఆడుకోవడానికి స్పెషల్‌గా పెద్ద బతుకమ్మ ఏర్పాటు చేయాలని సూచించారు. దేవాలయ ప్రాంతమంతా విద్యుత్ అలంకరణ ఉండే విధంగా ఏర్పాట్లు చేయాలని విద్యుత్ అధికారులకు సూచించారు.

సాంస్కృతిక కార్యక్రమాలు, అదేవిధంగా మైక్ సెట్లు, ఎల్ఈడీ స్క్రీన్లు ఏర్పాటు చేయాలని, ఎక్కువ సంఖ్యలో మహిళా పోలీసులను నియమించాలని, పారిశుద్ధ్య కార్యక్రమాలు కూడా సక్రమంగా జరపాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ 22వ తేదీ ఉదయం 7 గంటల వరకు బతుకమ్మ పువ్వులు తొలగించి శుభ్రంగా ఉంచాలని, దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు ప్రారంభమవుతున్నందున క్లీన్‌గా ఉంచాలని అధికారులకు మున్సిపల్ కమిషనర్ సూచించారు. మాస శివరాత్రి పురస్కరించుకొని దేవాలయంలో రుద్రేశ్వరీ-రుద్రేశ్వరస్వామికి కల్యాణోత్సవం నిర్వహించినట్లు ప్రధానార్చకుడు గంగు ఉపేంద్రశర్మ తెలిపారు.

# రూ.10 నాణెం మింగి అస్వస్థతతో విద్యార్థిని మృతి



నల్గొండ, సెప్టెంబర్ 20: పది రూపాయల కాయిన్ మింగి ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ అస్వస్థతతో విద్యార్థిని మృతి చెందిన సంఘటన శనివారం భూదాన్ పోచంపల్లి మండలం భీమనపల్లి గ్రామంలో చోటుచేసుకుంది. బాధితుల వివరాల ప్రకారం.. యాదాద్రి భువనగిరి జిల్లా భూదాన్ పోచంపల్లి మండలం భీమనపల్లి గ్రామానికి చెందిన ధ్యానమైన శేఖర్ జ్యోతి దంపతులకు ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె. కుమార్తె నిహారిక (10) భీమనపల్లి గ్రామంలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో 5వ తరగతి చదువుతున్నది. గురువారం సాయంత్రం బయట ఆడుకుంటుండగా పది రూపాయల కాయిన్ మింగింది. ఈ విషయమై తల్లిదండ్రులకు చెప్పడంతో చికిత్స కోసం విద్యార్థినిని వనస్థలిపురంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు.

ఆస్పత్రిలోని వైద్యులు నిహారికను పరీక్షించి ఆపరేషన్ చేసి కాయిన్ తొలగించారు. శుక్రవారం ఉదయం నిహారికను డిశ్చార్జ్ చేశారు. శనివారం ఉదయం నిహారికను నిద్ర నుంచి లేపేందుకు ప్రయత్నించగా ముఖమంతా ఆకుపచ్చ రంగుతో అపస్మారక స్థితిలో కనిపించింది. వెంటనే బాలికను వనస్థలిపురంలోని ఆపరేషన్ చేసిన ఆస్పత్రికే తీసుకువెళ్లారు. నిహారికను పరీక్షించి మృతి చెందిందని వైద్యులు నిర్ధారించారు. ఆస్పత్రి వైద్యుల నిర్లక్ష్యంతో ఆపరేషన్‌తో ఇన్‌ఫెక్షన్ బాలిక మృతి చెందిందని పేర్కొంటూ కుటుంబ సభ్యులు, బంధువులు ఆస్పత్రి ఎదుట ఆందోళన చేపట్టారు.

# మల్లు భట్టి విక్రమార్క పక్షపాతంగా వ్యవహరిస్తున్నారు-భట్టి విక్రమార్కపై సీపీఎం విమర్శ



ఖమ్మం, సెప్టెంబర్ 20: ఇందిరమ్మ ఇళ్ల కేటాయింపులో ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క పక్షపాతంగా వ్యవహరిస్తున్నారని ఆరోపిస్తూ సీపీఎం ఆధ్వర్యంలో ఖమ్మం జిల్లా బోనకల్లు మండలంలో లక్ష్మీపురం నుండి గోవిందాపురం ఎల్, గార్లపాడు, రావినూతల మీదుగా బోనకల్లు తాసీల్దార్ కార్యాలయం వరకు సుమారు 15 కిలోమీటర్లు పాదయాత్ర సాగింది.

అనంతరం తాసీల్దార్ కార్యాలయం ముందు ధర్నా నిర్వహించి, సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని తాసీల్దార్ మద్దెల రమాదేవికి సమర్పించారు. ఈ సందర్భంగా సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు పోతినేని సుదర్శన్ రావు మాట్లాడుతూ.. భట్టి విక్రమార్క కాంగ్రెస్ పార్టీకి ఉప ముఖ్యమంత్రివా లేక తెలంగాణ రాష్ట్రానికి ఉప ముఖ్యమంత్రివా.. అని ప్రశ్నించారు.

కవలం కాంగ్రెస్ కార్యకర్తలకే సంక్షేమ పథకాలు అందిస్తున్నారని తీవ్రంగా విమర్శించారు. ఈ పక్షపాత వైఖరిని మానుకోకపోతే భట్టి విక్రమార్క ఇంటిని ముట్టడిస్తామని ఆయన హెచ్చరించారు. గతంలో మధిర ఎమ్మెల్యే బోడెపుడి వెంకటేశ్వరరావు నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేశారని, కానీ ప్రస్తుత ఎమ్మెల్యే, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క కేవలం కాంగ్రెస్ వారికి మాత్రమే పథకాలు ఇస్తున్నారని విమర్శించారు. ఇది ప్రజాస్వామ్యానికి విరుద్ధమన్నారు. ప్రజా పాలనలో తీసుకున్న దరఖాస్తులను పట్టించుకోవడం లేదని, పేదలు, వికలాంగులు, వితంతువులకు అన్యాయం జరుగుతోందని ఆవేదన వ్యక్తం చేశారు.

సిపిఎం జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు మాట్లాడుతూ.. అర్హులైన ప్రతి ఒక్కరికీ ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయాలన్నారు. లేకపోతే పోరాటాలను ఉధృతం చేస్తామని హెచ్చరించారు. పేదల పక్షాన నిలబడేది కేవలం సీపీఎం మాత్రమేనని ఆయన స్పష్టం చేశారు.

ఇందిరమ్మ ఇళ్లు నిర్మించేది ప్రజల సొమ్ము అని, అది కాంగ్రెస్ నాయకుల సొత్తు కాదని గుర్తు చేశారు. ధనికులకు, కాంగ్రెస్ వారికి మాత్రమే ఇళ్లు ఇవ్వడం ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేయడమేనన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం డివిజన్ కార్యదర్శి మడుపల్లి గోపాల్ రావు, సిపిఎం జిల్లా సీనియర్ నాయకులు పొన్నం వెంకటేశ్వరరావు, చింతలచెరువు కోటేశ్వరరావు, జిల్లా కమిటీ సభ్యులు దొండపాటి నాగేశ్వరరావు, మండల నాయకులు తుళ్లూరు రమేష్, గుడ్డురి ఉమ, జొన్నలగడ్డ సునీత, చిట్టుమోదు నాగేశ్వరరావు, గుగులోత్ నరేష్, తెల్లాకుల శ్రీనివాసరావు, మాదినేని వీరభద్రరావు, జోనిబోయిన గురవయ్య, ఎర్రగాని నాగరాజు, కందికొండ శ్రీనివాసరావు, బంధం శ్రీనివాసరావు, మర్రి తిరుపతిరావు, గ్రామాల నుంచి సిపిఎం శాఖా కార్యదర్శులు, ప్రజా సంఘాల నాయకులు, పార్టీ సభ్యులు, సానుభూతిపరులు పాల్గొన్నారు.

# వర్షాకాల విరామానంతరం చార్‌ధామ్ యాత్ర హెలికాప్టర్ సేవలకు ఆమోదం తెలిపిన డీజీసీఏ

న్యూఢిల్లీ, సెప్టెంబర్ 20:వర్షాకాల విరామం తరువాత.. ఈ సంవత్సరం చార్‌ధామ్ యాత్రకు సంబంధించిన హెలికాప్టర్ సేవలను ఈ నెల 15, 16 తేదీల నుంచి పునఃప్రారంభించడానికి పౌర విమానయాన డైరెక్టర్ జనరల్ (డీజీసీఏ) అనుమతిని ఇచ్చింది.

పౌర విమానయాన శాఖ మంత్రి శ్రీ రాంమోహన్ నాయుడు నాయకత్వంలో సమగ్రంగా సమీక్షించిన అనంతరం చార్‌ధామ్ యాత్రను మరింత కట్టుదిట్టమైన ఏర్పాట్లతో సురక్షితంగా తీర్చిదిద్దడానికి తగిన చర్యలను చేపట్టారు. భద్రత పరంగా ఎలాంటి లోటుపాట్లనూ సహించేది లేదని ఆదేశాలు జారీ చేస్తూ, ఈ యాత్ర సురక్షితంగా ఉండేటట్లు చూడాలనీ, అవసరమైన కఠిన చర్యలన్నింటినీ తీసుకోవాలనీ డీజీసీఏకు ఆదేశాలిచ్చారు.

డీజీసీఏ, ఏఏఐ, రాష్ట్ర ప్రభుత్వంతో పాటు ఉత్తరాఖండ్ పౌర విమానయాన అభివృద్ధి ప్రాధికార సంస్థ (యూసీఏడీఏ) మధ్య మెరుగైన సమన్వయాన్ని ఏర్పరిచేందుకు మంత్రి శ్రీ రాంమోహన్ నాయుడు, ఉత్తరాఖండ్ ముఖ్యమంత్రి శ్రీ పుష్కర్ సింగ్ ధామితో కలిసి డెహ్రాడూన్‌లో, ఢిల్లీలో అనేక సార్లు సమావేశాలను నిర్వహించారు.

మంత్రి ఆదేశించిన ప్రకారం, డీజీసీఏ బృందం ఈ నెల 13-16 తేదీల మధ్య అన్ని హెలిప్యాడ్లు, హెలికాప్టర్లతో పాటు హెలికాప్టర్ సేవానిర్వహణ సంస్థల సన్నద్ధత చర్యలను, సహాయక వ్యవస్థలను సమగ్రంగా పరీక్షించడంతో పాటు తనిఖీలను కూడా పూర్తి చేసింది. హెలికాప్టర్ సేవలను పునఃప్రారంభించేందుకు యూసీఏడీఏకూ, హెలికాప్టర్ సేవల నిర్వహణ సంస్థలకూ ఆమోదం తెలిపారు.

దీనికి తోడు, హెలికాప్టర్ సేవల నిర్వహణ సంస్థలతో పాటు పైలట్లందరికీ ఈ యాత్రలో ఎదురయ్యే సవాళ్లు, తీర్థయాత్ర నిర్వహణ కార్యకలాపాలు, అదనపు భద్రత చర్యలన్నింటినీ డీజీసీఏ సమగ్రంగా తెలియజేసింది.

హెలికాప్టర్లలో చార్‌ధామ్ యాత్ర రెండు దశలలో సాగుతుంది: మొదటి దశ.. డెహ్రాడూన్ (సహస్త్రధార) నుంచి యమునోత్రి, గంగోత్రి, కేదార్‌నాథ్, బద్రీనాథ్ వరకు చార్టర్ సేవలు. రెండో దశ.. గుప్త్‌కాశీ, ఫాటా, సీతాపూర్ క్లస్టర్ నుంచి శ్రీ కేదార్‌నాథ్ జీ హెలిప్యాడ్ వరకు షటిల్ సేవలు. మొత్తం ఆరు హెలికాప్టర్ ఆపరేటర్లు (హెలికాప్టర్ సేవల నిర్వహణ సంస్థలు) గుప్త్‌కాశీ, ఫాటా, సీతాపూర్ క్లస్టర్ నుంచి హెలికాప్టర్ షటిల్స్‌ను నడుపుతాయి. ఏడు హెలికాప్టర్ సేవల నిర్వహణ సంస్థలు, సంఘాలు (కన్సార్టియమ్‌లు) డెహ్రాడూన్ (సహస్త్రధార) నుంచి చార్టర్ సేవలను అందిస్తాయి.

ఉత్తరాఖండ్‌లో అతి ఎత్తయిన ప్రాంతాల్లోను, సుదూర ప్రాంతాల్లోను నెలకొన్న తీర్థస్థలాల వద్దకు యాత్రికుల రాకపోకలను సులభతరం చేయడానికి హెలికాప్టర్ ముఖ్య పాత్ర పోషిస్తుంది. డీజీసీఏ సురక్షిత, నిరంతరాయ సేవలను అందించే దృష్టితో మరింత కట్టుదిట్టమైన భద్రతా చర్యలను తీసుకున్నారు. చార్‌ధామ్ యాత్రకు సంబంధించిన హెలికాప్టర్ సేవల నిర్వహణపై డీజీసీఏ నిరంతరం నిఘా ఉంచుతుంది. ఈ ఏడాది మే-జూన్ నెలల్లో చార్‌ధామ్ సెక్టర్లో హెలికాప్టర్ దుర్ఘటనలు అనేకం చోటుచేసుకొన్న నేపథ్యంలో, హెలికాప్టర్ సేవలను సురక్షితంగా నిర్వహించడానికి సంబంధించి వివిధ ఉన్నతాధికారులు నిర్దిష్ట చర్యలను సిఫారసు చేశాయి. ఏఏఐ ఆధ్వర్యంలో ఎయిర్ ట్రాఫిక్ కంట్రోలర్లనూ, ఐఎండీ వక్షాన వాతావరణ అధ్యయన అధికారులనూ, అలాగే యూఏసీఏడీఏ తరఫున కంట్రోల్ రూముల్లో అర్హులైన సిబ్బందినీ నియమించి, వారి సేవలను వినియోగించుకోవాలని సూచించారు.

డీజీసీఏ అమలుచేసిన ముఖ్య భద్రత కార్యక్రమాల్లో ఈ కింద ప్రస్తావించినవి కొన్ని :

చార్‌ధామ్ సెక్టర్లో విధులు నిర్వహించే పైలట్లందరికీ మార్గ తనిఖీతో పాటు తరచుగా శిక్షణ తీసుకోవడాన్ని తప్పనిసరి చేశారు.

ఎక్కువ ఎత్తులో నిర్వహణ, వాతావరణ పరంగా ప్రతికూల స్థితిని ఎదురైనప్పుడు ప్రతిస్పందన, క్రూ రిసోర్స్ మేనేజ్‌మెంట్‌లపై ప్రత్యేక శ్రద్ధ.

ఈ రంగంలో పూర్వానుభవం ఉన్న అర్హులైన పైలట్లను మాత్రమే నియమించడం.. వంటివి ఉన్నాయి.

గగనయాన యోగ్యతను ఉన్నత స్థాయిలో పరీక్షించడం

యాత్రకు ఉపయోగించే హెలికాప్టర్లు అందుకు అనువైనవిగా ఉన్నదీ లేనిదీ అన్ని కోణాల్లో సమగ్రంగా పరీక్షిస్తారు.

హెలికాప్టర్ తయారు చేసిన సంస్థ నిర్దేశించిన ప్రకారం మరమ్మతు షెడ్యూళ్లను కచ్చితంగా పాటించేటట్లు చూడడంతో పాటు, ఆపరేటింగ్ సీజన్లో తరచుగా తనిఖీలను కూడా నిర్వహిస్తుంటారు.

### నిర్వహణ పరంగా వివిధ భద్రతా చర్యలు

సవాళ్లతో కూడిన ప్రాంతంలో సురక్షిత యానంతో పాటు ల్యాండింగ్ కూడా సురక్షిత రీతిన జరిగేలా బరువు, సమతౌల్యం పరిమితులను కచ్చితంగా పాటించేలా చూడడం.

వరిస్థితి ఎలా ఉందీ తెలుసుకోవడానికి ఆధునిక నేవిగేషన్, కమ్యూనికేషన్ సహాయక ఉపకరణాలను ఉపయోగించడాన్ని తప్పనిసరి చేశారు.

ఒక ప్రత్యేక సమాచార వ్యవస్థను ఏర్పాటు చేసి పైలట్లకు రియల్ టైంలో తాజా సమాచారం ఇవ్వడంతోపాటు వాతావరణ పర్యవేక్షణకు ఉన్నత స్థాయి యంత్రాంగాన్ని సమకూర్చడం.

ఎయిర్ ట్రాఫిక్ సర్వీసుల మార్గదర్శకత్వాన్ని వినియోగించుకోవడం..

ప్రయాణికుల సురక్షతో పాటు వారి అవగాహనను పెంచడం హెలికాప్టర్లో కూర్చొనే ముందే ప్రయాణికులందరికీ భద్రతకు సంబంధించిన సమాచారాన్ని తెలియజేస్తారు. సీటు బెల్టును ధరించడం, సురక్షితంగా ఎక్కడం, దిగడం తాలూకు సమాచారాన్ని అందించడంతో పాటు, అత్యవసర స్థితిలో ఏయే జాగ్రత్తచర్యలు అవలంబించాలో తెలియజేస్తారు.

ప్రయాణికుల రాకపోకల్లో సహాయంతో పాటు వారిని నియంత్రించడం కోసం హెలిప్యాడ్ వద్ద గ్రౌండ్ సేఫ్టీ సిబ్బందిని మరింత మందిని నియమిస్తారు.

నియంత్రణ సంబంధిత పర్యవేక్షణ యంత్రాంగాన్ని బలపరచడం

భూమి మీది నుంచి పర్యవేక్షణ నిమిత్తం ముఖ్యమైన హెలిప్యాడ్ల వద్ద డీజీసీఏ ఫ్లయిట్ ఆపరేషన్స్ బృందాలతో పాటు విమానయాన యోగ్యత బృందాలను మోహరిస్తారు.

భద్రత పరమైన ఆదేశాలను తుచ తప్పక పాటిస్తున్నదీ లేనిదీ సరిచూడడానికి ఆకస్మిక తనిఖీలు చేస్తారు.

విమానయాన పరంగా అత్యున్నత స్థాయి భద్రతను అందించేందుకు డీజీసీఏ కట్టుబడి ఉంది. ప్రయాణికుల భద్రతతో పాటు హెలికాప్టర్ల సిబ్బంది భద్రత కూడా అన్నింటి కన్నా మిన్నగా పరిగణిస్తామని పునరుద్ఘాటించింది. చార్‌ధామ్ యాత్రను దృష్టిలో పెట్టుకొని హెలికాప్టర్ సేవలను పునఃప్రారంభించడంతో, ఈ పవిత్ర తీర్థస్థలాల వద్దకు చేరుకోవడానికి యాత్రికులకు సురక్షిత, సమర్థ, విశ్వసనీయ రవాణా సాధనాలు అందుబాటులోకి వస్తాయని భావిస్తున్నారు.

# కల్తీ, నకిలీ ఆహార పదార్థాల విక్రయాలపై ఆదివాసి విద్యార్థి సంఘం నిరసన

ఆదిలాబాద్, సెప్టెంబర్ 20: ఏజెన్సీ ప్రాంతంలో అమాయక గిరిజనుల అమాయకత్వాన్ని ఆసరాగా చేసుకొని కల్తీ , నకిలీ పదార్థాలు, సరుకుల విక్రయాలకు నిరసనగా ఆదివాసి విద్యార్థి సంఘం శనివారం మండల కేంద్రంలో నిరసన తెలిపింది. సంఘం జిల్లా అధ్యక్షుడు పెందోర్ సంతోష్ ఆధ్వర్యంలో ఆదిలాబాద్ జిల్లా గాదిగూడ మండల కేంద్రంలోని కుమ్రం భీం చౌరస్తా వద్ద గడువు చెల్లిన, నకిలీ, కల్తీ సరుకులతో నిరసన తెలిపారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఏజెన్సీ ప్రాంతం నార్నూర్, గాదిగూడ మండల కేంద్రంతో పాటు లోకారి, తాడిహత్నూర్, మేడిగూడ మార్కెట్లో, వారపు సంతలలో బడా, చిరు వ్యాపారస్తులు దుకాణాలలో గడువు చెల్లిన, కల్తీ, నాసిరకం ఆహార పదార్థాలు, సరుకులు విక్రయిస్తున్నారని ఆరోపించారు. ఫుడ్ అండ్ సేఫ్టీ అధికారులు పట్టించుకోకపోవడం శోచనీయమన్నారు.

ఆహారభద్రత శాఖ అధికారుల పర్యవేక్షణ లేక ఇష్టారీతిన విక్రయాలు చేస్తూ నిరక్షరాస్యుల ప్రాణాలతో చెలగాటం ఆడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.సంబంధిత శాఖ అధికారులు స్పందించి మార్కెట్‌లోని దుకాణాలు, సంతలలో తనిఖీలు నిర్వహించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆదివాసి సంఘాల నాయకులు మనోహర్, కనక ప్రభాకర్, మడవి చంద్ర హరి, మడవి యశ్వంత్ రావు, మెస్రం వామన్,మర్స గంగా రామ్, మెస్రం సంతోష్,కోడప లింగు,మారు, తిరుపతి, శంకర్, దాదిరావ్, శ్యాం రావ్, అజయ్ తదితరులున్నారు.

# యూపీఎస్సీ అభ్యర్థుల ధ్రువీకరణకు ప్రయోగాత్మకంగా ఏఐ ఆధారిత ముఖ గుర్తింపు విధానం

న్యూఢిల్లీ, సెప్టెంబర్ 20:ఇటీవల (సెప్టెంబర్ 14న) నిర్వహించిన ఎన్డీఏ, ఎన్ఏ ఎఎ, సీడీఎస్ ఎఎ పరీక్షల్లో అభ్యర్థుల వేగవంతమైన, సురక్షిత గుర్తింపు కోసం కృత్రిమ మేధ ఆధారిత ముఖ గుర్తింపు సాంకేతికతను పరీక్షించేందుకు ప్రయోగాత్మక కార్యక్రమాన్ని యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ విజయవంతంగా నిర్వహించింది.

జాతీయ ఈ-గవర్నెన్స్ విభాగం సహకారంతో చేపట్టిన ఈ కార్యక్రమం.. పరీక్షా ప్రక్రియలో నైతికతను పెంపొందించడంతో పాటు, పరీక్షా కేంద్రాల్లో అభ్యర్థులకు ప్రవేశాన్ని మరింత సులభతరం చేయడాన్ని లక్ష్యంగా పెట్టుకుంది.

ఈ ప్రయోగాత్మక కార్యక్రమాన్ని గురుగ్రామ్‌లో ఎంపిక చేసిన పరీక్ష కేంద్రాల్లో నిర్వహించారు. ఇక్కడ అభ్యర్థుల ముఖ చిత్రాలను వారి నమోదు సమయంలో సమర్పించిన ఫోటోలతో డిజిటల్‌గా సరిపోల్చారు. ఈ కొత్త సాంకేతిక విధానంతో ప్రతి అభ్యర్థి ధ్రువీకరణకు 8-10 సెకన్ల సమయం మాత్రమే పడుతోంది. దీని ద్వారా ప్రవేశ ప్రక్రియ మరింత వేగవంతమవడమే కాకుండా భద్రతా ప్రమాణాలు మెరుగవుతాయి.

యూపీఎస్సీ నిర్వహించిన ఈ ప్రయోగాత్మక ప్రాజెక్టు ద్వారా వివిధ సెషన్లలో పాల్గొన్న 1,129 మంది అభ్యర్థులకు సంబంధించిన 2,700కు పైగా స్కాన్లు విజయవంతంగా పూర్తయ్యాయి. ఆధునిక సాంకేతికత వినియోగంతో మరింత తెలివైన, సురక్షితమైన, సమర్థవంతమైన పరీక్షా విధానాల దిశగా ఈ ప్రయోగం ఒక ముందడుగు.

"పరీక్షల్లో న్యాయం, పారదర్శకతకు అత్యధిక ప్రాధాన్యతనిస్తూ, ఆధునిక సాంకేతికతను అందిపుచ్చుకునేందుకు కమిషన్ కట్టుబడి ఉంది. కృత్రిమ మేధా ఆధారిత ముఖ గుర్తింపు ప్రయోగం... తెలివైన, సురక్షితమైన, సమర్థవంతమైన పరీక్షా విధానాల వైపు యూపీఎస్సీ చేస్తున్న ప్రయత్నంలో కీలక ముందడుగు. కమిషన్ తన విధానాలను ఆధునీకరించేందుకు కట్టుబడి ఉన్నప్పటికీ.. మా ప్రక్రియల సమగ్రతను కాపాడటంలో పూర్తి జాగ్రత్తలు తీసుకున్నాం" యూపీఎస్సీ చైర్మన్ డాక్టర్ అజయ్ కుమార్.

ఈ ప్రయోగాత్మక ప్రాజెక్టు గురించి డాక్టర్ అజయ్ కుమార్ ట్వీట్ కూడా చేశారు.

# పేరుపల్లిలో 'స్వస్థ్ నారి - సశక్త్ పరివార్ అభియాన్'



ఖమ్మం, సెప్టెంబర్ 20:ఖమ్మం జిల్లా వైరా నియోజకవర్గ పరిధిలోని సింగరేణి(కారేపల్లి) మండలంలో సెప్టెంబర్ 16 నుండి అక్టోబర్ 2 వరకు మండల ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్ర పరిధిలో స్వస్థ్ నారీ- సశక్త్ పరివార్ అభియాన్ కొనసాగునున్నట్లు సీహెచ్‌ఓ మాధవి తెలిపారు. శనివారం పేరుపల్లిలో ఏర్పాటు చేసిన వైద్య శిబిరంలో ఆమె పాల్గొని మాట్లాడారు. అభియాన్ లో భాగంగా మహిళలకు ఉచిత వైద్య పరీక్షలు, గర్భిణీలకు యాంటినేటల్ చెకప్, రక్తపోటు, షుగర్, కంటి, ఇఎన్టి, దంత పరీక్షలు, రక్తహీనత (అనీమియా), క్షయ వ్యాధి (టి), సికిల్ సెల్, అనీమియా పరీక్షలు నిర్వహిస్తామని తెలిపారు. అదేవిధంగా నోటి, స్తన, గర్భాశయ క్యాన్సర్ స్క్రీనింగ్, రోగ నిరోధక టీకాలు, టెలి మెడిసిన్ సౌకర్యాలు కూడా అందుబాటులో ఉన్నట్లు చెప్పారు. పోషకాహారం ప్రోత్సాహం, రుతుక్రమ పరిశుభ్రత, స్థానిక ఆహార పదార్థాల వినియోగం, ఊబకాయం తగ్గింపు వంటి అంశాలపై ప్రజలకు అవగాహన కల్పించనున్నట్లు వెల్లడించారు.

అదేవిధంగా దోమ కాటు వల్ల వచ్చే వ్యాధులు, వాటి నివారణ చర్యలపై గ్రామస్తులకు అవగాహన కల్పించారు.

దోమల ద్వారా మలేరియా, డెంగ్యూ, చికున్‌గున్యా, ఫైలేరియా వంటి వ్యాధుల నివారణకు ప్రతి ఒక్కరూ జాగ్రత్తలు తప్పనిసరిగా తీసుకోవాలన్నారు. ఇంటి చుట్టూ నిల్వ నీరు లేకుండా చూడాలన్నారు, ట్యాంకులు, డబ్బాలు మూతలతో ఉంచాలన్నారు. రాత్రి పూట దోమ తెరలు ఉపయోగించడం,

శుభ్రత పాటించడం, సమయానికి వైద్యులను సంప్రదించడం ద్వారా దోమల ద్వారా వచ్చే వ్యాధులను సమర్థంగా నివారించవచ్చన్నారు. ప్రజల భాగస్వామ్యంతోనే దోమల నివారణ సాధ్యమని ప్రతి ఇంటి వద్ద పరిశుభ్రత ఉంటేనే గ్రామం ఆరోగ్యవంతం అవుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఏఎన్ఎంలు ఈసం కృష్ణవేణి, పొదెం నాగమణి, ఎం ఎల్ హెచ్ పీ, ఆశా కార్యకర్తలు రాంబాయి, రేణుక పాల్గొన్నారు.

# ఉత్తమ ఉపాధ్యాయుడికి గ్రామస్థుల సన్మానం



ఆదిలాబాద్, సెప్టెంబర్ 20: విద్యా బోధనలో ప్రశంసలు అందుకున్న నిర్మల్ జిల్లా కుభీర్ మండలం అంతర్ని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయుడు కత్తి నాగోరావ్ ను శనివారం గ్రామస్థులు సన్మానించారు . ప్రభుత్వ పాలన దినోత్సవం సందర్భంగా ఈనెల 17న జిల్లా కేంద్రంలో జరిగిన జెండా ఆవిష్కరణలో జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్, నిర్మల్ ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్ రెడ్డి నాగోరావును జిల్లా ఉత్తమ ఉపాధ్యాయుడిగా గుర్తించి సన్మానించారు.

ఈ సందర్భంగా గ్రామస్థులు, విద్యార్థులు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు కత్తి నాగోరావును ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ సునీత దేవిదాస్, హెచ్ఎం సుభాష్, ఆనంద్, సాయినాథ్, లక్ష్మణ్, దర్శనం దత్తు, భోజన్న, యోగేశ్వర్, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

# సింగరేణి పురోభివృద్ధికి అంకితభావంతో పని చేయాలి : తిరుమలరావు

ఖమ్మం, సెప్టెంబర్ 20:సింగరేణిలో ప్రతి ఒక్కరూ అంకితభావంతో పనిచేసి సంస్థ పురోభివృద్ధిలో భాగస్తులు అవ్వాలని సింగరేణి సంస్థ డైరెక్టర్ ఎం.తిరుమలరావు అన్నారు. శనివారం కొత్తగూడెం ఏరియాలో ఆయన పర్యటించారు. కొత్తగూడెం ఏరియా జనరల్ మేనేజర్ ఎం.శాలేం రాజు పూల మొక్క అందజేసి శాలువాతో సత్కరించి ఘనంగా స్వాగతించారు. ఈ సందర్భంగా వివిధ విభాగాల శాఖాధిపతులు, అధికారులు తమను పరిచయం చేసుకున్నారు. కొత్తగూడెం ఏరియాలోని కొత్తగూడెం జిఎం కార్యాలయం నందు డైరెక్టర్ ఎం. తిరుమల రావు సమీక్ష నిర్వహించారు.

ఈ సందర్భంగా కొత్తగూడెం ఏరియాలోని విభాగంలో అధికారులు, సూపర్‌వైజర్లు ఎంతమంది పనిచేస్తున్నారు, ఇంకా ఎంతమంది వేకెన్సీ ఉందని సంబంధిత అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ ఓ టు జీఎం జి.వి.కోటి రెడ్డి, ఏరియా ఇంజినీర్ కె.సూర్యనారాయణ రాజు, డీజీఎం (పర్సనల్) జి.వి. మోహన్ రావు, డీజీఎం (ఐఈడి) ఎన్.యోహాన్, డిజిఎం(ఈఎం) ఏరియా వర్క్ షాప్ జె.క్రిస్టోఫర్, కొత్తగూడెం ఏరియా ఇతర విభాగాల అధిపతులు, (ఈ&ఎం) అధికారులు పాల్గొన్నారు.

# ఎంపీ వద్దిరాజు మహిళా లోకానికి శుభాకాంక్షలు

ఖమ్మం, సెప్టెంబర్ 20 (నేటి నిజం ప్రతినిధి) :బతుకమ్మ పండుగ సందర్భంగా బీఆర్ఎస్ పార్లమెంటరీ పార్టీ డిప్యూటీ లీడర్, రాజ్యసభ సభ్యులు వద్దిరాజు రవిచంద్ర మహిళా లోకానికి హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. సుమారు వెయ్యేళ్ల సుదీర్ఘ చరిత్ర కలిగిన ఈ పండుగ తెలంగాణ సంస్కృతికి ప్రతీక అని, మన ఘనమైన సాంస్కృతిక వారసత్వాన్ని ప్రపంచానికి చాటి చెబుతున్నదని ఒక ప్రకటనలో ఎంపీ రవిచంద్ర పేర్కొన్నారు. భాద్రపద మాసం అమావాస్య నుంచి (రేపు ఆదివారం) తొమ్మిది రోజుల పాటు మహిళలు ప్రకృతిని, గౌరీదేవిని ఆరాధించే గొప్ప పండుగ బతుకమ్మ అని ఆయన చెప్పారు. స్థానికంగా లభించే తీరొక్క పూలతో మహిళలు బతుకమ్మలను పేర్చి కులాలకు అతీతంగా పిల్లా పాపలతో కలిసి ఆడుతూ పాడుతూ ఆనందోత్సవాల మధ్య జరుపుకునే ఈ పండుగ తెలంగాణకు మాత్రమే ప్రత్యేకమైనదని ఎంపీ రవిచంద్ర వివరించారు. తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర రావు ప్రతి ఏటా ఆడబిడ్డలకు చీరలను బహుమతిగా ఇవ్వడమే కాక ఈ పండుగను ఘనంగా జరిపించి ప్రపంచవ్యాప్తంగా విశేష ప్రాచుర్యాన్ని తేవడంతో ఆక్స్ ఫర్డ్ డిక్షనరీలో కూడా "బతుకమ్మ"కు చోటు లభించడాన్ని ఎంపీ రవిచంద్ర ఈ సందర్భంగా గుర్తు చేశారు. ప్రకృతిని, దైవత్వాన్ని ఆరాధించే ఈ బతుకమ్మ వేడుకలను మహిళలు భక్తి ప్రపత్తులతో జరుపుకోవాలని అభిలషించారు. విద్యా సంస్థలకు సెలవులు రావడం, విస్తారంగా వర్షాలు కురిసి చెరువులు, కుంటలు నీళ్లతో నిండి ఉన్నందున పిల్లలు ఎటువంటి ప్రమాదాల బారిన పడకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాల్సిందిగా ఎంపీ రవిచంద్ర ప్రజలకు హితవు పలికారు. ప్రపంచంలోనే అరుదైన ఈ పూల పండుగ సందర్భంగా రాష్ట్ర వాసులతో పాటు దేశంలోని వివిధ రాష్ట్రాలు, విదేశాలలో నివసిస్తున్న, స్థిరపడిన తెలంగాణ ఆడబిడ్డలందరికి ఎంపీ రవిచంద్ర హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. గౌరీదేవి కరుణా కటాక్షాలతో తెలంగాణ రాష్ట్రం పాడి పంటలతో సుభిక్షంగా వర్ధిల్లాలని, ప్రజలందరూ సుఖ సంతోషాలతో జీవించాలని ఎంపీ వద్దిరాజు మనసారా ఆకాంక్షించారు.

# జోరుగా ఐ.ఎల్.పీ.ఏ సభ్యత్వ నమోదు




ఖమ్మం, సెప్టెంబర్ 20: ఇండియన్ లీగల్ ప్రొఫేషనల్స్ అసోసియేషన్ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో జిల్లా కన్వీనర్ జనపరెడ్డి గోపి కృష్ణ అధ్యక్షతన క్రియాశీలక సభ్యత్వం నమోదు కార్యక్రమం కొత్తగూడెం జిల్లా కోర్టులో నిర్వహించారు. కొత్తగూడెం కోర్టు న్యాయవాదులు ఎర్ర శ్రీనివాసరావు, సాయి లహరి తదితరులు సభ్యత్వం స్వీకరించారు. ఈ కార్యక్రమంలో న్యాయవాదులు అంబటి రమేష్, యెర్రాపాటి కృష్ణ, మారపాక రమేష్, మహమ్మద్ సాదిక్ పాషా, అంకుష్ పాషా పాల్గొన్నారు.

# పెన్షన్లు పెంచి పంపిణీ చేయాలి

ఖమ్మం, సెప్టెంబర్ 20:ఎన్నికల ప్రచారంలో భాగంగా వృద్ధులు, వితంతువులు, ఒంటరి మహిళలు, దివ్యాంగులకు పెన్షన్లు పెంచుతామని కాంగ్రెస్ పార్టీ హామీ ఇచ్చిందని, ఆ హామీని వెంటనే నిలబెట్టుకోవాలని ఎంఆర్పీఎస్ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రధాన కార్యదర్శి దాసరి సారధి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఎంఆర్పీఎస్ రాష్ట్ర వ్యాప్త పిలుపులో భాగంగా శనివారం మున్సిపల్ కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తం చేసి, మున్సిపల్ కార్యాలయ సిబ్బందికి వినతిపత్రం అందజేశారు.

ఈ సంధర్భంగా మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి 21 నెలలు అవుతోందని, ఇప్పటి వరకు పెన్షన్ల ఊసే సీఎం రేవంత్‌రెడ్డి ఎత్తడం లేదని విమర్శించారు. ఎన్నికల్లో గెలిచేందుకు అడ్డగోలుగా హామీలు ఇచ్చి ఇప్పుడు హామీలను అమలు చేయకుండా కాలయాపన చేస్తున్నారని దుయ్యబట్టారు. వెంటనే పెన్షన్లు పెంచి పంపిణీ చేయాలని, లేనిపక్షంలో రాష్ట్ర వ్యాప్త ఆందోళనలు ఉధృతం చేస్తామని ఆయన హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎస్.వెంకన్న, వి.విజయభాస్కర్‌రావు, పి.కస్తూరి, వి.సత్యవతి, టి.నాగలక్ష్మీ, ఎస్.లక్ష్మి పాల్గొన్నారు.

# టాలీవుడ్‌లో మొదలైన హంగామా

హైదరాబాద్, సెప్టెంబర్ 20:పవర్ స్టార్ పవన్ కళ్యాణ్ సినిమా వస్తుందంటే అభిమానుల్లో కలిగే క్రేజ్ వర్ణనాతీతం. ప్రస్తుతం ఆయన నటిస్తున్నయాక్షన్ ఎంటర్‌టైనర్ ఓజీ విడుదలకు రోజులు మాత్రమే మిగిలి ఉండటంతో టాలీవుడ్‌లో హంగామా మొదలైంది. సెప్టెంబర్ 25న ప్రపంచవ్యాప్తంగా రిలీజ్ కాబోతున్నఈ చిత్రంపై హైప్ తారాస్థాయిలో కొనసాగుతోంది.

అడ్వాన్స్ బుకింగ్స్ ఇంకా ప్రారంభం కాకముందే టికెట్ల కోసం అభిమానులు రికార్డు స్థాయి డిమాండ సృష్టిస్తున్నారు. ముఖ్యంగా టికెట్ వేలం పాటలు విపరీతమైన చర్చనీయాంశంగా మారాయి.

నిజాం ప్రాంతంలో తొలి టికెట్‌ను టీమ్ పవన్ కళ్యాణ్ నార్త్ అమెరికా ఏకంగా రూ.5 లక్షలకు సొంతం చేసుకుంది. కూకట్‌పలిలోని విశ్వనాథ్ 70ఎఎ థియేటర్‌లో మొదటి టికెట్ రూ.1,12,000కి అమ్ముడైంది. అదే థియేటర్‌లో మరో ఇద్దరు అభిమానులు వరుసగా రూ.23,111, రూ.18 ,100కి టికెట్లు దక్కించుకున్నారు.

ఇక, తాజాగా చిత్తూరు జిల్లాకు చెందిన ఒక అభిమాని తన అభిమానాన్నివినూత్నంగా ప్రదర్శించాడు. రాబోయే ఓజీ చిత్రానికి సంబంధించిన మొదటి టికెట్‌ను ఒక లక్ష రూపాయలు వెచ్చించి కొనుగోలు చేశాడు.

ఈ సమాచారం తెలిసిన వెంటనే థియేటర్ నిర్వాహకులు.. ఈ మొత్తాన్నివృథా చేయకుండా సమాజహిత దిశగా మలిచేందుకు ముందుకొచ్చింది. ఆ అభిమాని చెల్లించిన మొత్తాన్ని గ్రామాల అభివృద్ధి నిమిత్తం జనసేన పార్టీ కార్యాలయానికి విరాళంగా పంపాలని నిర్ణయించింది. అభిమానుల ఉత్సాహాన్ని సమాజ సేవకు మలచిన ఈ నిర్ణయం సోషల్ మీడియాలో విస్తృతంగా వైరల్ అవుతూ ప్రశంసలు పొందుతోంది.

ఈ రికార్డు స్థాయి టికెట్ బిడ్డింగ్ ఓజీపై అభిమానుల్లో ఉన్నఅపారమైన క్రేజ్‌ను స్పష్టంగా తెలియజేస్తోంది. ఇప్పటికే టాలీవుడ్‌లో అత్యంత ఆసక్తిగా ఎదురుచూసే సినిమాల్లో ఈ చిత్రం ఒకటిగా నిలిచిపోయింది.

సాహో ఫేమ్ సుజీత్ దర్శకత్వంలో, డీవీవీ దానయ్య నిర్మాణంలో డీవీవీ ఎంటర్‌టైన్‌మెంట్స్ పతాకంపై భారీ బడ్జెట్‌తో ఈ చిత్రం తెరకెక్కింది. పవన్ కళ్యాణ్ సరసన ప్రియాంక అరుళ్ మోహన్ హీరోయిన్‌గా నటించగా, బాలీవుడ్ నటుడు ఇమ్రాన్ హష్మీ శక్తివంతమైన ప్రతినాయకుడిగా కనిపించనున్నారు.

# లక్నో మాల్ వద్ద కాల్పులు.. నలుగురు అరెస్ట్

లక్నో, సెప్టెంబర్ 20: షాపింగ్ మాల్ వద్ద కాల్పుల సంఘటన కలకలం రేపింది.కాల్పుల శబ్దం విని అక్కడున్న వారంతా భయాందోళన చెందారు. ఈ సమాచారం తెలుసుకున్న పోలీసులు అక్కడకు చేరుకున్నారు. మహిళతో సహా నలుగురిని అరెస్ట్ చేశారు. ఉత్తరప్రదేశ్ రాజధాని లక్నోలో ఈ సంఘటన జరిగింది.

సుశాంత్ గోల్ఫ్ సిటీ ప్రాంతంలోని పలాసియో మాల్‌లోకి ప్రవేశించేందుకు కొందరు వ్యక్తులు ప్రయత్నించారు. ఈ సందర్భంగా గేట్ వద్ద భద్రతా సిబ్బందితో వారు వాగ్వాదానికి దిగారు.

కాగా, ఈ ఘర్షణ నేపథ్యంలో ఒక వ్యక్తి తన లైసెన్స్ రివాల్వర్‌ను బయటకు తీశాడు. గాలిలోకి కాల్పులు జరిపాడు. దీంతో అక్కడ గందరగోళం చెలరేగింది. కాల్పుల శబ్దం విని అక్కడున్న వారు భయాందోళన చెందారు. పోలీసులకు సమాచారం ఇచ్చారు.

మరోవైపు పోలీసులు ఆ మాల్ వద్దకు చేరుకున్నారు. ముగ్గురు యువకులు, వారితో పాటు ఉన్న మహిళను అదుపులోకి తీసుకున్నారు. లైసెన్స్ కలిగిన రివాల్వర్‌ను స్వాధీనం చేసుకున్నారు. ఈ కాల్పుల సంఘటనలో ఎవరికీ గాయాలు కాలేదని పోలీస్ అధికారి తెలిపారు. ఈ సంఘటనపై దర్యాప్తు చేస్తున్నట్లు వెల్లడించారు.

# హెక్టారుకు రూ.50వేలు జమ

## -రూ.1200 లు మద్దతు ధర అమలులో ఉండదు
## -ఎక్కడ ధర లభిస్తే.. అక్కడ అమ్ముకోవచ్చు
## -ఆదివారం కర్నూలు మార్కెట్ యార్డ్ కు సెలవు
## -జాయింట్ కలెక్టర్ డాక్టర్ బీ.నవ్య

అమరావతి, సెప్టెంబర్ 20:కర్నూలు జిల్లా ఉల్లి రైతులకు ఊరట కల్పిస్తూ రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకుందని, జిల్లాలోని ఉల్లి రైతులకు హెక్టారుకు రూ. 50 వేల చొప్పున నేరుగా రైతుల బ్యాంక్ అకౌంట్లలో రాష్ట్ర ప్రభుత్వం జమ చేస్తుందని జాయింట్ కలెక్టర్ డాక్టర్ బీ.నవ్యతెలిపారు.

సోమవారం నుంచి రూ.1200 లు మద్దతు ధర అమలులో ఉండదని, రైతులు కళ్ళాల్లో కాని, లోకల్ ట్రేడర్స్ దగ్గర, ఇతర మార్కెట్లలో కాని, తమ ఉల్లి పంటకు ఎక్కడ మంచి ధర వస్తే అక్కడ అమ్ముకోవచ్చని జాయింట్ కలెక్టర్ తెలిపారు

. మార్కెట్ యార్డ్‌లో అమ్ముడుపోని ఉల్లిని రైతులు తీసుకువెళ్లి ఎక్కడైనా అమ్ముకోవచ్చని జాయింట్ కలెక్టంతెలిపారు.

భారీ వర్షాలు లేదా వరదలు వస్తే విపత్తు సాయంగా హెక్టార్‌కు రూ.25 వేలు మాత్రమే మంజూరు చేస్తారు, కానీ ప్రస్తుతం ఉల్లి రైతులను ఆదుకోవాలనే ఉద్దేశంతో ముఖ్యమంత్రిరెట్టింపు మొత్తంతో హెక్టార్‌కు రూ. 50 వేల ఆర్థిక సహాయాన్నిప్రకటించారు. సోమవారం నుంచి మార్కెట్ యార్డ్ లో ఉల్లి క్రయవిక్రయాలు ట్రేడర్స్ ద్వారా జరుగుతాయని, పీడీఎస్ సిస్టం అమలులో ఉండదని, మార్క్ ఫెడ్ ద్వారా కొనుగోలు ఉండదని జాయింట్ కలెక్టర్ తెలిపారు. ఆదివారం కర్నూలు మార్కెట్ యార్డ్ కు సెలవు ప్రకటించారని, రైతులు ఈ విషయాన్నిగమనించి, మార్కెట్ యార్డ్ కు ఉల్లి తీసుకురావద్దని జాయింట్ కలెక్టర్ విజ్ఞప్తి చేశారు.

# వరద బాధితులకు అండగా మాజీ మంత్రి తలసాని..



హైదరాబాద్, సెప్టెంబర్ 20:భారీ వర్షాలకు నష్టపోయిన బాధిత కుటుంబాలకు అండగా నిలుస్తామని మాజీమంత్రి, సనత్ నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ అన్నారు. శనివారం వెస్ట్ మారేడ్‌పల్లిలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో సనత్ నగర్ నియోజకవర్గ స్థాయి బిఆర్ఎస్ పార్టీ ముఖ్య నేతల సమావేశం ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ అధ్యక్షతన జరిగింది.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు రాంగోపాల్ పేట డివిజన్‌లోని కాచిబౌలి, నల్లగుట్ట, జూలమ్మ టెంపుల్ తదితర ప్రాంతాల్లో ఇండ్లలోకి వర్షపునీరు చేరి సామాగ్రి తడిసిపోయి తీవ్రంగా నష్టపోయిన వారికి అండగా నిలవనున్నట్లు తెలిపారు. ఈ నెల 21 వ తేదీన ఉదయం 9.00 గంటల నుండి ఆయా ప్రాంతాలలో 1500 బాధిత కుటుంబాలకు ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ ఆధ్వర్యంలో బియ్యం, పప్పు, నూనె తదితర నిత్యావసర సరుకులు పంపిణీ చేసేందుకు సిద్ధం చేశారు. బాధిత కుటుంబాలకు సరుకుల పంపిణీ కార్యక్రమంలో నియోజకవర్గ పరిధిలోని కార్పొరేటర్ లు, మాజీ కార్పొరేటర్ లు, డివిజన్ అధ్యక్షులు, మాజీ అధ్యక్షులు, నాయకులు పాల్గొనాలని పిలుపునిచ్చారు.

ఈ సమావేశంలో కార్పొరేటర్ లు కొలన్ లక్ష్మి, కుర్మ హేమలత, టి. మహేశ్వరి, మాజీ కార్పొరేటర్ నామన శేషుకుమారి, అత్తిలి అరుణ గౌడ్, అత్తిలి మల్లిఖార్జున్ గౌడ్, డివిజన్ అధ్యక్షులు అత్తిలి శ్రీనివాస్ గౌడ్, కొలన్ బాల్ రెడ్డి, ఆకుల హరికృష్ణ, హన్మంతరావు, వెంకటేషన్ రాజు, శ్రీనివాస్ గౌడ్, నాయకులు తలసాని స్కైలాబ్ యాదవ్, లక్ష్మీపతి, ప్రవీణ్ రెడ్డి, ఏసూరి మహేష్, శ్రీహరి, నాగులు, సురేష్ గౌడ్, కిషోర్, ఖలీల్, అశోక్ యాదవ్, పీయూష్ గుప్తా, కట్టా బలరాం, శేఖర్, గోపిలాల్ చౌహాన్ తదితరులు పాల్గొన్నారు.

24న పీపుల్స్ ప్లాజాలో బతుకమ్మ

ఈ నెల 24 వ తేదీన పీపుల్స్ ప్లాజాలో బిఆర్ఎస్ పార్టీ రాష్ట్ర మహిళా విభాగం ఆధ్వర్యంలో నిర్వహించే బతుకమ్మ వేడుకలను సనత్ నగర్ నియోజకవర్గ పరిధిలోని అన్ని డివిజన్‌ల నుండి మహిళలు పెద్ద సంఖ్యలో హాజరుకావాలని మాజీమంత్రి, సనత్ నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ పిలుపునిచ్చారు. శనివారం వెస్ట్ మారేడ్‌పల్లిలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో మహిళా నేతలతో కలిసి నియోజకవర్గ ముఖ్య నాయకులతో సమావేశం నిర్వహించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రకృతిని పూజించే పండుగ, మహిళలు జరుపుకునే గొప్ప పండుగ బతుకమ్మ అని అన్నారు. అంతకు ముందు మాజీ ఎమ్మెల్యే పద్మా దేవేందర్ రెడ్డి, మాజీ జిల్లా పరిషత్ చైర్మన్ తుల ఉమ, మాజీ కార్పొరేషన్ చైర్మన్ రజిని సాయిచంద్, సుశీలారెడ్డి, సుమిత్రానంద్, శ్రీదేవి, రజితా రెడ్డి, నిర్మల తదితరులు ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ తో ప్రత్యేకంగా సమావేశమై బతుకమ్మ ఏర్పాట్లపై చర్చించారు.

# నిండు ప్రాణాన్ని బలి తీసుకున్న అనస్తీషియా హైడోస్.. తన్వి హాస్పిటల్‌లో ఘటన

హైదరాబాద్, సెప్టెంబర్ 20: వైద్యుల నిర్లక్ష్యం కారణంగా ఓ నిండు ప్రాణం బలైంది. ముక్కుపచ్చలారని చిన్నారిని వైద్యం కోసం తీసుకువచ్చిన తల్లిదండ్రులకు గర్భశోకం మిగిలింది. యాదాద్రి భువనగిరి జిల్లా భూదాన్ పోచంపల్లి మండలం భీమనపల్లికి చెందిన ధ్యాన మొయిన శేఖర్, జ్యోతి దంపతులకు ఇద్దరు కుమారులు ఒక కూతురు. కూతురు ధ్యానమైన నిహారిక (11) గురువారం సాయంత్రం ప్రమాదవశాత్తు 10 రూపాయల నాణెం మింగింది. దీంతో కుటుంబ సభ్యులు హుటాహుటిన వనస్థలి పురంలోని హుడా సాయి నగర్ కమాన్ వద్ద ఉన్న తన్వి హాస్పిటల్‌కు తీసుకువచ్చారు. అదే రోజు రాత్రి సర్జరీ చేసిన వైద్యులు నిహారిక మింగిట 10 రూపాయల కాయిన్‌ను తొలగించారు. అనంతరం మరుసటి రోజు ఉదయం సమయంలో పేషెంట్ పూర్తిగా కోలుకోకుండానే డిశ్చార్జ్ చేశారు. ఇంటికి తీసుకెళ్లిన తర్వాత శుక్రవారం సాయంత్రం మళ్లీ నిహారిక అస్వస్థతకు గురైంది. వెంటనే శనివారం ఉదయం కుటుంబ సభ్యులు తిరిగి నిహారికను తన్వి హాస్పిటల్‌కు తీసుకువచ్చారు. తన కూతురిని కాపాడాలని హాస్పిటల్ వైద్యులను సిబ్బందిని వేడుకున్నారు. కానీ హాసిటల్ యాజమాన్యం నిహారికను తిరిగి అడ్మిట్ చేసుకోకుండా నిర్లక్ష్యంగా వ్యవహరించారు. తాము ఏమి చేయలేమని ఇతర హాస్పిటల్‌కు తీసుకవెళ్లాలని ఉచిత సలహా ఇచ్చారు. ఇంతలోనే పాపం పసి ప్రాణం గాలిలో కలిసిపోయింది. హాస్పిటల్ యాజమాన్యం, డాక్టర్ల నిర్లక్ష్యం కారణంగానే తమ కూతురు ప్రాణాలు కోల్పోయిందని నిహారిక తల్లిదండ్రుల రోదనలు పలువురిని కలిచి వేశాయి. 10 రూపాయల నాణెం తొలగించేందుకు అనుభవం లేని డాక్టర్లు అనస్తీషియా డోస్ ఎక్కువగా ఇవ్వడం వల్లనే చిన్నారి నిహారిక తీవ్ర అస్వస్థతకు గురైందని బంధువులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. తన్వి హాస్పిటల్ నిర్వాహకుడు రాము అనే వ్యక్తిపై ఇప్పటికే పలు ఆరోపణలు ఉన్నాయి. ఈ హాస్పిటల్‌లో గర్భస్థ పరీక్షలు నిర్వహించి అబార్షన్లు కూడా చేస్తారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. దీనిపై వైద్య ఆరోగ్యశాఖ పూర్తిస్థాయి విచారణ చేపట్టి నిహారిక కుటుంబ సభ్యులకు న్యాయం చేయాలని పలువురు డిమాండ్ చేస్తున్నారు.

# జిఓ నం. 68ను వెంటనే రద్దు చేయాలి

## -తెలంగాణ అవుట్‌డోర్ మీడియా ఓనర్స్ అసోసియేషన్ బిజెపి మద్దతు

## -బిజెపి రాష్ట్ర అధ్యక్షులు ఎన్. రామచంద్రారావు డిమాండ్




హైదరాబాద్ సెప్టెంబర్ 20 (ఎక్స్ ప్రెస్ న్యూస్ );ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఉ.ా. ఔ. 68 ను వెంటనే రద్దు చేయాలని బిజెపి రాష్ట్ర అధ్యక్షులు ఎన్. రామచంద్రారావు డిమాండ్ చేసారు. తెలంగాణ అవుట్ డోర్ మీడియా ఓనర్స్ అసోసియేషన్ అమావేశం శనివారం బిజెపి రాష్ట్ర కార్యాలయం లో జరిగింది ఈ సమావేశానికి రామచంద్రారావు ముఖ్యాతిధిగా విచ్చేసి ప్రసంగించారు. గత ఎన్నికలకు ముందు, కాంగ్రెస్ పార్టీ ఈ విషయాన్ని అంగీకరించి, దాని మ్యానిఫెస్టోలో స్పష్టమైన హామీని చేర్చిందని కాని కాంగ్రెస్ మరియు ఃఖీా పార్టీలు తమకు ఇష్టమైన 3 ఏజెన్సీలకు మాత్రమే ప్రయోజనం చేకూర్చేందుకు దోహదపడ్డాయని విమర్శించారు. ఉఊఓఅ పరిమితుల్లో 208 హోర్డింగ్ ఏజెన్సీలు పనిచేస్తున్నాయి. 2020లో, ప్రజా భద్రత కింద, అప్పటి ఃఖీా ప్రభుత్వం ఉ.ా. ఔ. 68 ను ప్రవేశపెట్టింది, వాటి కార్యకలాపాలను సమర్థవంతంగా రద్దు చేసి, ఉఊఓఅ ప్రాంతం నుండి చిన్న ఏజెన్సీలను బహిష్కరించింది. ఈ చర్య మూడు ప్రధాన ఏజెన్సీలకు మాత్రమే ప్రయోజనం చేకూర్చడం, ఏకస్వామ్య నిర్మాణాన్ని సృష్టించడం లక్ష్యంగా పెట్టుకుందని దుయ్యబట్టారు. చిన్న హోర్డింగ్ ఏజెన్సీలు పనిచేస్తూనే ఉన్న ఇతర మునిసిపల్ కార్పొరేషన్లలో కూడా, ప్రభుత్వం వాటి హోర్డింగ్‌లను తొలగించడానికి జోక్యం చేసుకుంటోంది, తద్వారా వారి జీవనోపాధిని దెబ్బతీస్తుందని ఆవేదన వ్యక్తం చేసారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వెంటనే జీవో నంబర్ 68ని రద్దు చేయాలని బిజెపి తెలంగాణ రాష్ట్ర కమిటీ గట్టిగా డిమాండ్ చేస్తోంది. ప్రభుత్వం ఈ న్యాయమైన డిమాండ్‌ను పరిష్కరించడంలో విఫలమైతే, బిజెపి ప్రభావిత సంస్థలతో కలిసి నిలబడి నిరసన ఉద్యమాలను తీవ్రతరం చేస్తుందని హెచ్చరించారు. విద్యను పూర్తి చేసిన తర్వాత ఉద్యోగాలు పొందలేకపోయిన నిరుద్యోగ యువత జీవనోపాధి కోసం ఏజెన్సీలను ప్రారంభించారు. జీవో 68 కారణంగా దాదాపు 50,000 కుటుంబాలు తమ ఆదాయాన్ని కోల్పోయి ఇప్పుడు వీధిన పడ్డారననేరు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చినప్పటి నుండి జరుగుతున్న అక్రమాలకు రాష్ట్ర ప్రభుత్వం మరియు ప్రభుత్వం అనుకూలంగా ఉన్న ఏజెన్సీలు బాధ్యత వహిస్తాయా?అని రామచంద్ర రావు ప్రశ్నించారు .కావునా , ఉ.ా. 68ని వెంటనే రద్దు చేయడం ద్వారా మరియు రాష్ట్రవ్యాప్తంగా చిన్న మరియు పెద్ద హోర్డింగ్ ఏజెన్సీలకు మద్దతు ఇవ్వడం ద్వారా ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలని రామచంద్ర రావు డిమాండ్ చెసారు.

# మేక్ ఇన్ ఇండియా చొరవ దశాబ్దానికి గుర్తుగా మేక్ ఇన్ ఇండియా స్మారక నాణేల ఆవిష్కరణ

న్యూఢిల్లీ, సెప్టెంబర్ 20:మేక్ ఇన్ ఇండియా చొరవ దశాబ్దం పూర్తయిన సందర్భంగా కేంద్ర వాణిజ్య మరియు పరిశ్రమల మంత్రి శ్రీ పియూష్ గోయల్ ఈరోజు న్యూఢిల్లీలో మేక్ ఇన్ ఇండియా స్మారక నాణేన్ని ఆవిష్కరించారు. గత పదేళ్లలో, ఈ చొరవ పెట్టుబడులను సులభతరం చేసింది, ఆవిష్కరణలను ప్రోత్సహించింది, ప్రపంచ స్థాయి మౌలిక సదుపాయాలను నిర్మించింది మరియు భారతదేశాన్ని తయారీ, డిజైన్ మరియు ఆవిష్కరణలకు ప్రపంచ కేంద్రంగా నిలిపింది. ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ నాయకత్వంలో, ఈ కార్యక్రమం దేశీయ తయారీని పెంచడంలో, ఆవిష్కరణలను ప్రోత్సహించడంలో, నైపుణ్య అభివృద్ధిని పెంచడంలో మరియు విదేశీ పెట్టుబడులను సులభతరం చేయడంలో కీలక పాత్ర పోషించింది.

ఈ ప్రారంభోత్సవంలో శ్రీ గోయల్ మాట్లాడుతూ, ప్రధానమంత్రి 2014 సెప్టెంబర్ 25న మేక్ ఇన్ ఇండియాను ప్రవేశపెట్టినప్పుడు, భారతదేశాన్ని తయారీ, డిజైన్ మరియు ఆవిష్కరణలకు ప్రపంచ కేంద్రంగా మార్చడమే దీని ఉద్దేశ్యం అని అన్నారు. "ఈ రోజు, ఈ దశాబ్దపు ప్రయాణాన్ని మనం గుర్తుచేసుకుంటున్న సందర్భంగా, భారతదేశం యొక్క బలాన్ని స్థితిస్థాపక, స్వావలంబన మరియు ప్రపంచవ్యాప్తంగా పోటీతత్వ ఆర్థిక వ్యవస్థగా మేము పునరుద్ఘాటిస్తున్నాము" అని ఆయన అన్నారు. గత దశాబ్దంలో, ఈ చొరవ భారతదేశ తయారీ రంగంలో విశ్వాసాన్ని తిరిగి రగిలించింది, దేశాన్ని ప్రధానంగా సేవల ఆధారిత ఆర్థిక వ్యవస్థగా చూడటం నుండి గుర్తింపు పొందిన ప్రపంచ తయారీ శక్తి కేంద్రంగా మార్చింది. 2014 మరియు 2024 మధ్య, భారతదేశం USD 667 బిలియన్ల విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులను అందుకుంది, ఇది సరళీకరణ తర్వాత వచ్చిన మొత్తం పెట్టుబడులలో దాదాపు మూడింట రెండు వంతుల వాటాను కలిగి ఉంది. వ్యాపార సౌలభ్యతలో కూడా దేశం గణనీయమైన పురోగతిని సాధించింది, 2014లో 142వ స్థానంలో ఉన్న ప్రపంచ బ్యాంకు డూయింగ్ బిజినెస్ నివేదిక 2020లో 63వ స్థానానికి చేరుకుంది. 2024-25 ఆర్థిక సంవత్సరంలో వస్తువుల ఎగుమతులు USD 437.42 బిలియన్లకు చేరుకున్నాయి, ప్రపంచ వాణిజ్యంలో భారతదేశం కీలక పాత్ర పోషించింది. భారతదేశం యొక్క స్టార్టప్ పర్యావరణ వ్యవస్థ 1.80 లక్షలకు పైగా DPIIT-గుర్తింపు పొందిన స్టార్టప్‌లకు పెరిగింది, ఇది యునైటెడ్ స్టేట్స్ మరియు చైనా తర్వాత ప్రపంచవ్యాప్తంగా మూడవ అతిపెద్దదిగా నిలిచింది మరియు 2025 నాటికి 118 యూనికార్న్‌లతో 17.6 లక్షలకు పైగా ఉద్యోగాలను సృష్టించింది.

# రక్షా మంత్రి సెప్టెంబర్ 22-23, 2025న మొరాకో సందర్శన

న్యూఢిల్లీ, సెప్టెంబర్ 20:రక్షా మంత్రి శ్రీ రాజ్‌నాథ్ సింగ్ సెప్టెంబర్ 22-23, 2025 వరకు మొరాకోలో రెండు రోజుల అధికారిక పర్యటన చేపడతారు, మొరాకో జాతీయ రక్షణ ప్రతినిధి శ్రీ అబ్దేల్తిఫ్ లౌడియీ ఆహ్వానం మేరకు.

ఇది ఉత్తర ఆఫ్రికా దేశానికి రక్షా మంత్రి చేసిన తొలి పర్యటన, ఇది భారతదేశం మరియు మొరాకో మధ్య పెరుగుతున్న వ్యూహాత్మక కలయికను నొక్కి చెబుతుంది.

బెర్రెచిడ్‌లో టాటా అడ్వాన్స్‌డ్ సిస్టమ్స్ మారోక్ యొక్క వీల్డ్ ఆర్మర్డ్ ప్లాట్‌ఫామ్ (చిప్త్రంఖ) 8ఝ8 కోసం కొత్త తయారీ సౌకర్యం ప్రారంభోత్సవం ఈ పర్యటనలో కీలకమైన అంశం.

ఈ సౌకర్యం ఆఫ్రికాలో మొట్టమొదటి భారతీయ రక్షణ తయారీ కర్మాగారం, ఇది ఆత్మనిర్భర్ భారత్ చొరవ కింద భారతదేశ రక్షణ పరిశ్రమ యొక్క పెరుగుతున్న ప్రపంచ పాదముద్రను ప్రతిబింబించే ముఖ్యమైన మైలురాయిని సూచిస్తుంది.

ఈ పర్యటన సందర్భంగా, రక్షణ, వ్యూహాత్మక మరియు పరిశ్రమ సహకారాన్ని బలోపేతం చేయడానికి రక్షా మంత్రి శ్రీ లౌడియీతో ద్వైపాక్షిక సమావేశం నిర్వహిస్తారు. పారిశ్రామిక సహకారం కోసం మార్గాలను అన్వేషించడానికి ఆయన మొరాకో పరిశ్రమ మరియు వాణిజ్య మంత్రి శ్రీ ర్యాద్ మెజ్జార్‌ను కూడా కలుస్తారు.

శ్రీ రాజ్‌నాథ్ సింగ్ తన పర్యటన సందర్భంగా రబాత్‌లోని శక్తివంతమైన భారతీయ సమాజంతో కూడా సంభాషిస్తారు.

# బొల్లారం రైల్వే స్టేషన్ సమీపంలో ఘోర ప్రమాదం..

## రైలు ఢీకొని ఇద్దరు మృతి

హైదరాబాద్, సెప్టెంబర్ 20:సికింద్రాబాద్ రైల్వే స్టేషన్ పరిధిలోని బొల్లారం రైల్వే స్టేషన్ సమీపంలో శనివారం మధ్యాహ్నం ఘోర ప్రమాదం చోటు చేసుకుంది. రైలు పట్టాలపై నడుచుకుంటూ వెళున్న ముగ్గురు యువకులను వేగంగా దూసుకొచ్చిన ఓ రైలు ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఇద్దరు అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోగా, మరొకరు తీవ్రంగా గాయపడ్డారు.

అప్రమత్తమైన స్థానికులు రైల్వే సిబ్బందికి, పోలీసులకు సమాచారం అందించారు. ఘటనాస్థలానికి చేరుకున్న రైల్వే పోలీసులు మృతదేహాలను స్వాధీనం చేసుకున్నారు. తీవ్ర గాయాలపాలైన మరో యువకుడిని చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. ఈ యువకుడి పరిస్థితి విషమంగా ఉన్నట్లు సమాచారం. మృతుల వివరాలు తెలియాల్సి ఉంది. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

# సర్కారు ఆసుపత్రికి ఉపశమనం

## -రూ.కోటి ఆధునిక వైద్య పరికరాలు

## -ఏలూరు జనం హ్యాపీ

హైదరాబాద్, సెప్టెంబర్ 20:అర కొర సౌకర్యాలు, వైద్య పరికరాల కొరతతో ఇబ్బంది పడుతున్నఏలూరు ప్రభుత్వ సర్వజన ఆసుపత్రిక స్వాంతన చేకూరనుంది. ఎంపీ మహేష్ యాదవ చొరవతో రూ.కోటి రూపాయల వైద్య పరికరాలు సమకూరాయి.

కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ (సీఎస్ఆర్) కింద గెయిల్ ఇండియా నుంచి కోటి రూపాయల వైద్య పరికరాలు అందాయి. ప్రభుత్వ ఆసుపత్రికి అవసరమైన అనస్థీషియా వర్క్ స్టేషన్ పరికరాలు, కార్డియో టోమో గ్రఫీ మెషిన్లు, కంప్యూటెడ్ రేడియోగ్రఫీ సిస్టమ్ (ఎక్స్‌రే క్యాసెట్ రీడర్), హెమటాలజీ అనలైజర్ (ఓపెన్ లూప్), హెమటాలజీ అనలైజర్ (ఓపెన్ లూప్), ఐ లైన్డ్ రిఫ్రిజిరేటర్లు కోరుతూ, ఈ ఏడాది మార్చిలో గెయిల్ ఇండియాకు ఆసుపత్రి సూపరింటెండెంట్ పేరుతో లేఖ రాశారు.

సీఎస్ఆర్(అూఖీ) కింద నిధులు కేటాయించి ఈ వైద్య పరికరాలు ఏర్పాటు చేయాల్సిందిగా ఏలూరు ఎంపీ మహేష్ యాదవ్ కోరడంతో గెయిల్ ఇండియా సానుకూలంగా స్పందించి నిధులు కేటాయించింది. తాజాగా శుక్రవారం రాత్రి వైద్య పరికరాలు ఆసుపత్రికి చేరాయి. కొద్దిరోజుల్లోనే రోగులకు అందుబాటులోకి తీసుకువస్తామని ఆసుపత్రి వర్గాలు తెలియచేశాయి.

దీనిపై హర్షం వ్యక్తం చేసిన ఎంపీ మహేష్ యాదవ్, ఆసుపత్రి అభివృద్ధికి తాను శాయశక్తులా కృషి చేస్తానని, భవిష్యత్తులో మరిన్నివసతుల కల్పనకు ప్రయత్నిస్తానని హామీ ఇచ్చారు.

# మద్యం మత్తులో 12 నెలల కూతురిని నేలకేసి కొట్టిన కసాయి తండ్రి

## - చికిత్స పొందుతూ కూతురు దుర్మరణం

సూర్యాపేట సెప్టెంబర్ 20 (ఎక్స్ ప్రెస్ న్యూస్ : మద్యం మత్తులో 12 నెలల కూతురిని కసాయి తండ్రి నేలకేసి కొట్టడంతో చనిపోయింది. ఈ సంఘటన సూర్యాపేట జిల్లా కేంద్రంలోని ప్రియాంక కాలనీలో జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం? దంపతులు గొడవ పడుతుండగా 12 నెలల పసికందు ఏడ్చింది. దీంతో ఏడుపుకు ఇరుగుపొరుగువారు వస్తారని వెంటనే కూతురును నేలకేసి కొట్టాడు. తీవ్రంగా గాయపడిన కూతురును స్థానిక ఆస్పత్రికి తరలించారు. తలకు బలమైన గాయాలు కావడంతో చికిత్స పొందుతూ కూతురు దుర్మరణం చెందింది.

# పెద్దమునగాలలో ఘనంగా బతుకమ్మ పూల సంబరం



ఖమ్మం, సెప్టెంబర్ 20 (నేటినిజం ప్రతినిధి) : కొణిజర్ల మండలం పెద్దమునగాల ప్రైమరీ స్కూల్ నందు శనివారం బతుకమ్మ ముందస్తు వేడుకలు ఘనంగా హెచ్‌ఎం విజయలక్ష్మి ఆధ్వర్యంలో జరిగాయి. విద్యార్థులు రంగురంగుల పూలతో అమర్చి బతుకమ్మలు తయారుచేసి ఆటపాట ఆడటం జరిగింది. ఈ కార్యక్రమంలో పెద్దమునగాల గ్రామ మాజీ సర్పంచ్, జిల్లా కాంగ్రెస్ నేత పరికపల్లి శ్రీనివాస్ గౌడ్, నల్లమోతు చిన్న నరసింహారావు, పరికపల్లి అంజయ్య, విద్యార్థిని విద్యార్థులు, ఉపాధ్యాయులు తదితరులున్నారు.

# మహిళలకు బంగారు నాణేల లక్కీ డిప్

## -మహిళలకు బంగారు నాణేల లక్కీ డిప్

## -హిందూ ఉత్సవ సమితి ఆధ్వర్యంలో

## -మహా బతుకమ్మసంబరాలు

హైదరాబాద్, సెప్టెంబర్ 20:హిందూ ఉత్సవ సమితి ఆధ్వర్యంలో మహా బతుకమ్మ సంబరాలు నిర్వహిస్తున్నట్లు అధ్యక్షుడు చుంచు రాజు కిరణ్, ప్రధాన కార్యదర్శి రవీందర్, ఉపాధ్యక్షుడు దబ్బేట తిరుపతితెలిపారు. ఈనెల



24న జిల్లా పరిషత్ బాలుర పాఠశాల మైదానంలో బతుకమ్మ ఆటపాట ఉంటుందని, మహిళలకు ప్రోత్సాహంగా లక్కీ డ్రా ద్వారా బంగారు నాణేలు, ప్రోత్సాహక బహుమతులు ఉంటాయని తెలిపారు.

ఆసక్తి గల మహిళలు తమ పేర్లను నమోదు చేసుకోవాలని కోరారు.

బతుకమ్మ సంస్కృతిని చాటేందుకు సంబరాలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు.

జిల్లాలోని అన్ని ప్రాంతాల నుండి మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కోరారు. ః

తెలంగాణ సంస్కృతి సాంప్రదాయాలను గౌరవిస్తూ నేటి తరాలకు వాటి ప్రాముఖ్యతను తెలిపేందుకు హిందూ ఉత్సవ సమితి కృషి చేస్తున్నట్లు వెల్లడించారు.

# డబుల్ బెడ్ రూంల వద్ద అన్ని సదుపాయాలను పూర్తి చేయాలి : కలెక్టర్ సంతోష్



మహబూబ్‌నగర్, సెప్టెంబర్ 20: రెండు పడకల గృహాల వద్ద అన్ని సదుపాయాలను వెంటనే పూర్తిచేయాలని జిల్లా కలెక్టర్ బీఎం సంతోష్ అధికారులను ఆదేశించారు. శనివారం జిల్లా కేంద్రంలోని దొదర్ పల్లి సమీపంలో నిర్మించి లబ్ధిదారులకు అందజేసిన రెండు పడకల గృహాలను కలెక్టర్ పరిశీలించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, లబ్ధిదారులకు కేటాయించిన గృహాలలో నివాసముండే విధంగా మున్సిపల్ కమిషనర్ ఆధ్వర్యంలో వార్డ్ ఆఫీసర్లు క్షేత్రస్థాయిలో అవగాహన కల్పించాలన్నారు. రెండు పడకల గృహాల్లో విద్యుత్ కనెక్షన్ కోసం అవసరమైన అన్ని చర్యలు పూర్తి చేసి ఇళ్లకు విద్యుత్ సౌకర్యం కల్పించాలన్నారు. పెండింగ్‌లో ఉన్న పెయింటింగ్ పనులు, డ్రైనేజ్ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని పంచాయతీ రాజ్ అధికారులను ఆదేశించారు.

నీటి సౌకర్యం అందించే విధంగా అదనంగా 200 కేఎల్ సామర్థ్యంతో మిషన్ భగీరథ కింద నిర్మాణంలో ఉన్న ఓహెచ్ఎస్ఆర్ వాటర్ ట్యాంక్‌ను నెల రోజుల్లో పూర్తిచేయాలని సూచించారు. అంతకుముందు దొదర్ పల్లి సమీపంలో జిల్లా మహిళా సమాఖ్య భవనం నిర్మాణ పనులను పరిశీలించారు. కలెక్టర్ వెంట మున్సిపల్ కమిషనర్ జానకిరామ్, విద్యుత్ శాఖ ఎస్ఈ శ్రీనివాస్ రెడ్డి, పంచాయతీరాజ్ శాఖ ఈఈ ప్రభాకర్, మిషన్ భగీరథ ఏఈ నూర్, తదితరులు పాల్గొన్నారు.

# చెరువులో దూకి వ్యక్తి ఆత్మహత్య



నల్గొండ, సెప్టెంబర్ 20: తనను గత పది రోజులుగా ఏదో శక్తి రమ్మని పిలుస్తుందంటూ ఓ వ్యక్తి చెరువులో దూకి ఆత్మహత్య చేసుకున్నాడు. వివరాలు ఇలా ఉన్నాయి. హనుమకొండ జిల్లా రాంనగర్‌కు చెందిన బర్ల సురేందర్ (36) హైదరాబాద్ రామంతపుర్‌లో గల డి మార్ట్ వెనకాల భార్య, పిల్లలతో నివసిస్తున్నాడు. సురేందర్ హైటెక్ సిటీలోని ఓ ప్రైవేట్ బ్యాంక్‌లో ఉద్యోగం చేస్తున్నాడు. శుక్రవారం ఉదయం డ్యూటీకి వెళ్తున్నా అని చెప్పి బయల్దేరి క్యాబ్ బుక్ చేసుకుని బీబీనగర్ పెద్ద చెరువు వద్దకు చేరుకున్నాడు. చెరువు వద్దకు రాగానే తన భార్యకు నాకు నిత్యం కలలో చావు రమ్మటుందని, శక్తి పిలుస్తుందని, పీడ కలలు వస్తున్నాయని, ఎవరో పిలుస్తున్నట్లు అనేక రకాలుగా కలలు వస్తున్నాయని, నేను చనిపోతున్నానని మెసేజ్, వాయిస్ రికార్డులు పంపించాడు. నా చావుకి ఎవరూ కారణం కాదని, ఎలాంటి విచారణ చేపట్టవద్దని చెప్పి చెరువులోకి దూకి ఆత్మహత్య చేసుకున్నాడు.

కుటుంబ సభ్యులు సురేందర్ మానసిక పరిస్థితి బాగాలేదని పలు దేవాలయాలు, దైవ దర్శనాలకు తిప్పారు. మానసిక పరిస్థితి మెరుగు కావడంతో ఇక నుంచి ఉద్యోగానికి వెళ్తానని ఇంట్లో చెప్పడంతో బయటకు వెళ్లేందుకు అనుమతి ఇచ్చారు. గత నాలుగు రోజులుగా డ్యూటీకి సక్రమంగా వెళ్తున్న సురేందర్ శుక్రవారం ఉదయం ఉద్యోగానికి వెళున్నట్లు చెప్పి క్యాబ్ బుక్ చేసుకుని బీబీనగర్ పెద్ద చెరువుకు చేరుకున్నాడు. చెరువు వద్దకు రాగానే కుటుంబ సభ్యులు, బంధువులకు ఫోన్ ద్వారా చెరువులో దూకి చనిపోతున్నానని, నాకు పాత ఇంట్లో చావు కార్యక్రమాలు చేయాలని, నా చావుకు ఎవరూ కారణం కాదని వాయిస్ రికార్డు చేసి బంధువులకు పంపి, చెరువు గట్టుపై షూ విప్పి, సెల్ ఫోన్ పెట్టి చెరువులో దూకాడు. కుటుంబ సభ్యులు పోలీసులకు సమాచారం ఇవ్వగా చెరువు వద్దకు చేరుకున్న పోలీసులు, రెస్క్యూ టీం గాలింపు చర్యలు చేపట్టారు. సురేందర్‌కు భార్య, కుమారుడు(5) ఉన్నాడు.

భర్త చెరువులో దూకి ఆత్మహత్యకు పాల్పడ్డాడని, సురేందర్ భార్య కూడా చెరువులో దూకింది. దీంతో అప్రమత్తమైన పోలీసులు, రెస్క్యూ టీం సంధ్యారాణిని వెంటనే కాపాడారు. చెరువులో దూకిన సంధ్యారాణి వద్దకు వెళ్లి కుమారుడు అమ్మా నువ్వు చనిపోవద్దని అనడంతో ఒక్కసారిగా కుటుంబ సభ్యులందరూ రోధించారు. పోలీసులు, రెస్క్యూ టీం సిబ్బంది ముమ్మరంగా గాలింపు చర్యలు చేపట్టగా శనివారం ఉదయం మృతదేహం లభించింది.

# గౌతమ్ గ్రూప్ ఆఫ్ స్కూల్స్‌లో వైభవంగా ముందస్తు బతుకమ్మ వేడుకలు..



రాజన్న సిరిసిల్ల, సెప్టెంబర్ 20:(నేటినిజం ప్రతినిధి): తెలంగాణ ఆత్మను ప్రతిబింబించే బతుకమ్మ పండుగను గౌతమ్ గ్రూప్ ఆఫ్ స్కూల్స్‌లో శనివారం ముందస్తుగా ఘనంగా జరిపారు. విద్యార్థులు, ఉపాధ్యాయులు సంప్రదాయ వేషధారణలో ఉత్సాహంగా పాల్గొని వేడుకలకు మరింత అందాన్ని చేకూర్చారు.రంగురంగుల పూలతో అందంగా పేర్చిన బతుకమ్మలు ప్రాంగణం నిండా శోభాయమానంగా కనిపించాయి. విద్యార్థులు బతుకమ్మ చుట్టూ తిరుగుతూ బతుకమ్మ పాటలు పాడి, సాంప్రదాయ నృత్యాలు చేసి ఉత్సవాన్ని మరింత అందంగా మార్చారు. రంగురంగుల లంగావోణీలు, సంప్రదాయ చీరలలో అలరించిన విద్యార్థినులు ఆకట్టుకున్నారు.ఈ సందర్భంగా పాఠశాల కరస్పాండెంట్ మాట్లాడుతూ విద్యార్థుల్లో సంస్కృతి, సంప్రదాయాలపై అవగాహన పెంపొందించడం మా ప్రధాన లక్ష్యమని, బతుకమ్మ పండుగ కేవలం పూల ఉత్సవం మాత్రమే కాదు, బతుకమ్మ ప్రకృతిని, స్త్రీ శక్తిని ఆరాధించే పండుగ అని తెలిపారు. విద్యార్థులు సాంస్కృతిక విలువలను ఆచరిస్తే సమాజానికి ఉపయోగకరమని పేర్కొన్నారు.సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్న ఈ వేడుకల్లో ప్రిన్సిపల్ హరికిషన్, శివ సాయి చరణ్ తదితరులు పాల్గొన్నారు.

# ఉజ్వల పాఠశాలలో ముందస్తు బతుకమ్మ వేడుకలు



వేములవాడ, సెప్టెంబర్ 20: వేములవాడ పట్టణం గాంధీ నగర్ లోని ఉజ్వల లో ముందస్తు బతుకమ్మ వేడుకలను అత్యంత వైభవంగా నిర్వహించారు. పిల్లలు సాంప్రదాయ దుస్తులు ధరించి బతుకమ్మలను పేర్చి అన్నింటిని ఒకచోట చేర్చి పిల్లలందరూ సామూహికంగా బతుకమ్మ పాటలతో ఆడి పాడి చూపరులను ఆకట్టుకున్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పాఠశాల డైరెక్టర్లు అరుణాద్రి, వెంకటేశ్వర్లు హాజరై, ఈ పండుగ యొక్క విశిష్టతను, మన సాంప్రదాయాలను చక్కగా పిల్లలకు వివరించారు. తెలంగాణ అని చెప్పగానే ముందుగా గుర్తుకు వచ్చే పండుగ బతుకమ్మ పండుగ ,తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత బతుకమ్మను రాష్ట్ర పండుగగా నిర్ణయించారు. బతుకమ్మ పండుగ యొక్క గొప్పతనాన్ని విద్యార్థులు తమ సొంత మాటల్లో వివరించారు. ఈ పండుగను తొమ్మిది రోజులపాటు ఆడ పడుచులు భక్తిశ్రద్ధలతో జరుపుకు ంటారు మొదటి రోజు ఎంగిలిపూల బతుకమ్మ ,రెండవ రోజు అటుకుల బతుకమ్మ ,మూడవ రోజు ముద్దపప్పు బతకమ్మ ,నాలుగవ రోజు నాన బియ్యము బతుకమ్మ ,5వ రోజున అట్ల బతుకమ్మని, ఆరవ రోజున అలిగిన బతుకమ్మని ,ఏడవ రోజును వేపకాయ బతుకమ్మ ని, 9వ రోజున సద్దుల బతుకమ్మగా వైభవంగా జరుపుకుం టారు.ఈ కార్యక్రమానికి పిల్లలతో పాటు ఉపాధ్యాయినులు ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. ఈ కార్యక్రమా న్ని నిర్వహించడం పట్ల పిల్లలు వారి తల్లిదండ్రులు ఉపాధ్యాయుని ఉపాధ్యాయులు, ప్రిన్సిపల్స్ సంతోషం వ్యక్తం చేశారు.

# రాజన్నను దర్శించుకున్న ఐపిఎస్ సౌమ్య మిశ్రా



రాజన్న సిరిసిల్ల, సెప్టెంబర్ 20:(నేటినిజం ప్రతినిధి): శ్రీ పార్వతి రాజరాజేశ్వర స్వామిని తెలంగాణ రాష్ట్ర డైరెక్టర్ జనరల్ ఆఫ్ ప్రిజన్స్ అండ్ కరెక్షనల్‌సర్వీసెస్ డాక్టర్ సౌమ్య మిశ్రా దర్శించుకున్నారు. స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు చెల్లించుకున్నారు.ముందస్తుగా ఆలయానికి రాగానే అర్చకులు, వేదపండితులు స్వస్తితో స్వాగతం పలికారు. అనంతరం కళ్యాణ మండపంలో వేదపండితులు, అర్చకులు ఆశీర్వచనం అందజేశారు. ఆలయ స్వామివారి శేషవస్త్రం, అమ్మవారి వస్త్రం,లడ్డూ ప్రసాదాన్ని అందజేశారు.వారి వెంట జైళ్ల శాఖ డిఐజి సంపత్, రాజన్న సిరిసిల్ల జిల్లా ఎస్పీ మహేష్ బి. గీతే, వేములవాడ అదనపు ఎస్పీ శేషాద్రిన్ రెడ్డి, ఎస్ఐ ఎల్లగౌడ్, ఆర్ఎస్ఐ రాజు, ఆలయ పర్యవేక్షకులు నూగురి నరేందర్, సీనియర్ అసిస్టెంట్ బొడుసు మహేష్,జూనియర్ అసిస్టెంట్ సింహాచారి, ఆలయ సిబ్బంది, పోలీసులు పాల్గొన్నారు.

# హైకోర్టు ఆదేశాలు అమలు చేయండి- కిషన్ చంద్ ఫౌండేషన్ ట్రస్ట్ వినతి



హైదరాబాద్, సెప్టెంబర్ 20:ప్రభుత్వ అధికారులు హైకోర్టు ఆదేశాలు అమలు చేయాలని కిశన్ చంద్ ఫౌండేషన్ ట్రస్ట్ చైర్మన్ త్రిలోక్ చంద్ కోరారు. బషీరాబాగ్ ప్రెస్ క్లబ్లో శనివారం మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హైదరగూడలో ఉన్న కిశన్ చంద్ ఫౌండేషన్ ట్రస్ట్ ఎంఏ గార్డెన్ ఫంక్షన్ హాల్‌కు సంపూర్ణ యజమానులు, లీజుదారులుగా ఉన్నామన్నారు. అయితే, 2025 సెప్టెంబర్ 11న ప్రభుత్వ అధికారులలో కొందరు మండల రెవెన్యూ అధికారి, రెవెన్యూ డివిజనల్ అధికారి సహా పై అధికారుల ఆదేశాల మేరకు చట్టపరమైన విధి విధానాలు పాటించక బలవంతంగా మా ఆస్తిలోకి ప్రవేశించారన్నారు. ప్రధాన ప్రవేశ ద్వారానికి తాళం వేశారన్నారు. ఆస్తి ప్రభుత్వానికి చెందిందని బోర్డులు ప్రదర్శించారని పేర్కొన్నారు. 2025 సెప్టెంబర్ 12న తెలంగాణా హైకోర్ట్ వద్ద చి.ఖ. ఔనీబ. 27718/2025, 27715/2025లో ఆదేశాలు పొందామన్నారు. ఈ ఆదేశాల ప్రకారం.. తక్షణ చర్యలు తీసుకోవద్దని, తాళాలు తొలగించమని పేర్కొన్నారన్నారు. అధికారులు ఆ ఆదేశాలను పాటించడంలో విఫలమయ్యారని చెప్పారు. హైదరాబాద్ సిటీ సివిల్ కోర్టు ముందు టైటిల్ డిక్లరేషన్, స్వాధీన పునరుద్ధరణ, శాశ్వత ఇంజక్షన్ కోసం ఒక దావాను దాఖలు చేశామన్నారు. ఇది ఓఎస్ నెంబర్ 438 ఆఫ్ 2025 ఎఎ అదనపు ప్రధాన న్యాయాధికారి, సిటీ సివిల్ కోర్ట్, హైదరాబాద్ వద్ద ప్రస్తుతం ఉందన్నారు. అధికారులు కోర్టు ఆదేశాలు అమలు చేయాలని విన్నవించారు. ఈ సందర్భంగా కిశన్ చంద్ ఫౌండేషన్ ట్రస్ట్ ట్రస్టీ ఇమ్రాన్ బిన్ హజీ మాట్లాడుతూ తెలంగాణ ప్రభుత్వం చట్టాలను అమలు చేయడంలో అలసత్వం వహించడం దురదృష్టకరమన్నారు. టౌన్ సర్వే ల్యాండ్ రికార్డ్ (టూఎస్ఎల్ఆర్)లో నమోదును టైటిల్ డాక్యుమెంట్‌గా పరిగణించలేమన్నది అందరికీ తెలిసిన విషయమన్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం వెర్సస్ హైదరాబాద్ పాటరీస్ ప్రైవేట్ లిమిటెడ్ (2010) ఐదు సుప్రీంకోర్టు కేసులు 382, దాని తర్వాత అనేక ఇతర తీర్పులలో సుప్రీంకోర్టు ధృవీకరించిందన్నారు. కిషన్ చంద్ ఫౌండేషన్ ట్రస్ట్, లీజుదారులు నెంబర్ 12 ప్రాంగణంలో ఏంఏ గార్డెన్ ఫంక్షన్ హాల్‌ను నిర్వహిస్తున్నారన్నారు. 3-6-292 హైదర్‌గూడ హైదరాబాద్, 2వ ఫర్వార్ది 1353 ఫస్లి డాక్యుమెంట్ నంబర్ 817 ఆఫ్ 1353 ఫస్లి నుంచి ప్రారంభించి అమలు చేయబడిన రిజిస్టర్డ్ సేల్ డీడ్‌ల కింద భూమికి యాజమాన్యాన్ని గుర్తించారన్నారు.

తర్వాత 13వ అబాన్ 1354 తేదీ నాటి రిజిస్టర్డ్ సేల్ డీడ్ 1354 ఫాస్లి డాక్యుమెంట్ నెంబర్ 2625 ఆఫ్ 1354 ఫాస్లి, తరువాత 22/07/1968 తేదీ నాటి రిజిస్టర్డ్ సేల్ డీడ్‌లు 2183/1968, 2184/1968 డాక్యుమెంట్ నెంబర్లను కలిగి ఉన్నాయన్నారు. అక్కడి కొనుగోలుదారులు 10/03/1969 తేదీ నాటి రిజిస్టర్డ్ ట్రస్ట్ డీడ్ డాక్యుమెంట్ నెంబర్ కింద ఛారిటబుల్ ట్రస్ట్‌ను ఏర్పాటు చేశారన్నారు. ట్రస్ట్ నిర్వహణ రిజిస్టర్డ్ పత్రాల ద్వారా రుజువు అవుతుందన్నారు. ట్రస్ట్ ఈ ప్రాంగణాన్ని మొదట ఈఎఫ్ ఫంక్షన్ హాల్‌కు లీజుకు ఇచ్చిందన్నారు. చివరిగా రిజిస్టర్ చేయబడిన లీజు డీడ్‌లు 15/06/2022 నాటివన్నారు. డాక్యుమెంట్ నెంబర్లు 1760/2022, 1761/2022, రెండు రిజిస్టర్డ్ లీజు డీడ్‌లు 15/06/2022 తేదీతో ఉన్నాయని చెప్పారు.

# అక్రమంగా మట్టి తరలిస్తున్న టిప్పర్లు పట్టివేత

బోనకల్లు, సెప్టెంబర్ 20 : అక్రమంగా మట్టి తరలిస్తున్న మూడు టిప్పర్లను స్థానిక ఎస్ఐ పొదిలి వెంకన్న శనివారం పట్టుకున్నారు. బోనకల్లు మండలంలోని లక్ష్మీపురం గ్రామంలో గల ఎర్రమట్టి గుట్టలను ఎటువంటి అనుమతులు లేకుండా అక్రమంగా టిప్పర్ల ద్వారా తరలిస్తున్నారు. ఈ విషయం తెలుసుకున్న ఎస్ఐ తన సిబ్బందితో కలిసి వెళ్లి అక్రమంగా మట్టి రవాణా చేస్తున్న 3 టిప్పర్లను స్వాధీనం చేసుకున్నారు. మైనింగ్ శాఖకు పంపించి రెండు టిప్పర్లపై ఈ-చలాన్లు విధించినట్లు ఎస్ఐ తెలిపారు. మట్టి అక్రమ రవాణా చేస్తే చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు.

# హెడ్ కానిస్టేబుల్ కూతురికి మెడికల్ సీట్

ఆదిలాబాద్, సెప్టెంబర్ 20:మంచిర్యాల జిల్లా బెల్లంపల్లి మండలం సోమగూడెంకు చెందిన గుజ్జుల సిరికుందన హైదరాబాద్ ఉస్మానియా మెడికల్ కళాశాలలో ఎంబీబీఎస్ సీట్ సాధించింది.

గుజ్జుల రాజేంద్ర ప్రసాద్-రజిత దంపతుల కుమార్తె సిరికుందన నీట్ పరీక్షలో ప్రతిభను కనబరిచింది. నీట్ ఫలితాల్లో తెలంగాణ స్టేట్ 911 ర్యాంక్ సాధించి ఉస్మానియా మెడికల్ కళాశాలలో సీట్ సాధించింది. సిరికుందన తండ్రి రాజేంద్ర ప్రసాద్ ఏఆర్ హెడ్ కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తున్నారు.

ఈ సందర్భంగా మెడికల్ సీట్ సాధించిన సిరికుందనను పలువురు అభినందించారు.

# సిపిఐ జాతీయ మహాసభలకు బయల్దేరిన భద్రాద్రి కొత్తగూడెం ప్రతినిధులు

ఖమ్మం, సెప్టెంబర్ 20:ఈ నెల 21 నుండి ఐదు రోజుల పాటు పంజాబ్ రాష్ట్రం చండీగఢ్‌లో జరగనున్న సిపిఐ జాతీయ మహాసభలకు భద్రాద్రి కొత్తగూడెం జిల్లా నుంచి తొమ్మిది మందికి అవకాశం లభించింది. సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్ కె సాబీర్ పాషా, రాష్ట్ర సమితి సభ్యులు ముత్యాల విశ్వనాథం, కల్లూరి వెంకటేశ్వర్ రావు, నరాటి ప్రసాద్, సారెడ్డి పుల్లారెడ్డి, మున్నా లక్ష్మీకుమారి, ఎస్ డి.సలీం, సలిగంటి శ్రీనివాస్, దేవరకొండ శంకర్ శనివారం చండీగఢ్‌కు బయల్దేరి వెళ్లారు. రాష్ట్ర పార్టీ కోటానుంచి కొత్తగూడెంకు చెందిన ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు ప్రతినిధిగా పాల్గొననున్నారు.

ఈ సందర్భంగా జిల్లా కార్యదర్శి ఎస్ కె సాబీర్ పాషా మాట్లాడుతూ.. రాష్ట్రంలోని బొగ్గు గని ప్రాంతాల్లో ప్రతిపాదనలో ఉన్న నూతన బొగ్గు గనుల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా, మహాత్మాగాంధీ గ్రామీణ ఉపాధి హామీ పథకం, 1/70 చట్టం అమలు, కార్మిక చట్టాలు, ప్రభుత్వ రంగ సంస్థల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా, గ్రామీణ ప్రాంతంలో గిరిజన, గిరిజనేతర పేదల భూ సమస్యలు, విమానాశ్రయం, జిల్లాలో కేంద్రీయ విద్యాలయాల ఏర్పాటు వంటి వాటిపై జిల్లా తరుపున తీర్మానం ప్రవేశ పెడతామని తెలిపారు.

# సమాజ సేవలోనే సంతృప్తి : డాక్టర్ వరుణ్ కుమార్

కొత్తగూడెం అర్బన్, సెప్టెంబర్ 20 : సేవ చేయడంలోనే సంతృప్తి ఉంటుందని, ప్రతీ ఒక్కరు ఎంతో కొంత సమాజానికి తమ వంతు సేవ చేయాలని ఎముకలు, కీళ్ల శస్త్ర చికిత్స నిపుణుడు డాక్టర్ వరుణ్ కుమార్ అన్నారు. శనివారం కొత్తగూడెం పట్టణంలోని సత్యసాయి ఆశ్రమంలో వృద్ధులకు ఉచితంగా పరీక్షలు నిరసించి మందులను, నిత్యవసర వస్తువులను, పండ్లను పంపిణీ చేశారు. సేవా కార్యక్రమాలతో మానసిక ఉల్లాసంతో పాటు, సామాజిక సేవ చేసిన తృప్తి కలుగుతుందన్నారు. భవిష్యత్‌లో మరిన్ని సేవా కార్యక్రమాలు తమ హాస్పిటల్ ద్వారా చేస్తామని ఆయన ఈ సందర్భంగా తెలిపారు.

# భార్యగొంతు కోసిన భర్త

భువనేశ్వర్, సెప్టెంబర్ 20: భార్యతో రాజీ కోసం ఒక వ్యక్తి ప్రయత్నించాడు. 175 కిలోమీటర్లు ప్రయాణించి ఆమె వద్దకు చేరుకున్నారు. అయితే వారి మధ్య వాగ్వాదం జరిగింది. ఈ నేపథ్యంలో ఆగ్రహించిన అతడు బహిరంగంగా ఆమె గొంతు కోశాడు. అప్రమత్తమైన స్థానికులు అతడ్ని పట్టుకుని కొట్టి పోలీసులకు అప్పగించారు. ఒడిశాలోని బాలాసోర్ జిల్లాలో ఈ సంఘటన జరిగింది. కుటుంబ గొడవల వల్ల షేక్ అమ్జాద్ అతడి భార్య విడిపోయారు. వేర్వేరు ప్రాంతాల్లో నివసిస్తున్నారు.

కాగా, భార్యతో రాజీపడాలని షేక్ అమ్జాద్ భావించాడు. దీంతో కటక్ నుంచి 175 కిలోమీటర్లు ప్రయాణించి బాలాసోర్ చేరుకున్నాడు. అక్కడ తన భార్యను కలిశాడు. ఆమెను రోడ్డు పక్కకు తీసుకెళ్లాడు. భార్య ముఖం పట్టుకుని మాట్లాడాడు. ఉన్నట్టుండి ఆమె జుట్టు పట్టుకున్నాడు. వెంట తెచ్చిన కత్తితో భార్య గొంతు కోశాడు.

మరోవైపు ఇది చూసిన స్థానికులు షాక్ అయ్యారు. భార్యపై కత్తితో దాడి చేసిన అమ్జాద్‌ను పట్టుకున్నారు. అతడ్ని కొట్టి పోలీసులకు అప్పగించారు. తీవ్రంగా గాయపడిన మహిళను బాలాసోర్ జిల్లా ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లారు. చికిత్స అందించిన వైద్యులు మెరుగైన వైద్యం కోసం కటక్‌లోని మెడికల్ కాలేజీ ఆసుపత్రికి రిఫర్ చేశారు. దీంతో అక్కడకు తరలించి చికిత్స అందిస్తున్నారు.

కాగా, ఆ మహిళ ఆరోగ్య పరిస్థితి విషమంగా ఉన్నట్లు పోలీస్ అధికారి తెలిపారు. ఆమె భర్తను అరెస్ట్ చేసినట్లు చెప్పారు. ఈ సంఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు వెల్లడించారు. మరోవైపు రోడ్డుపై వెళ్లే వ్యక్తి తన మొబైల్ ఫోన్‌లో రికార్డ్ చేసిన భార్యపై భర్త కత్తి దాడి వీడియో క్లిప్ సోషల్ మీడియాలో వైరల్ అయ్యింది.

# సమాజ ఉన్నతిలో ఉపాధ్యాయుల పాత్ర కీలకం : అంకతి సత్యం

నల్గొండ, సెప్టెంబర్ 20: సమాజ ఉన్నతిలో ఉపాధ్యాయుల పాత్ర కీలకమని నిడమనూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ అంకతి సత్యం, తాసీల్దార్ జంగాల కృష్ణయ్య అన్నారు. నిడమనూరు మండల పరిషత్ సమావేశ మందిరంలో శనివారం మండలంలో ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికైన 22 మంది ఉపాధ్యాయులను శాలువాలతో సత్కరించి మెమొంటో, ప్రశంసా పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. సమాజ నిర్మాణం ఉపాధ్యాయుల కృషి పైనే ఆధారపడి ఉందన్నారు.

ఉత్తమ పౌరులను తీర్చిదిద్ది సమాజానికి అందించే గురువుల ప్రాధాన్యం నేటి ఆధునిక యుగంలోనూ తగ్గలేదన్నారు. సమాజ నిర్మాణంలో ఉత్తమ పౌరులను అందించేందుకు ఉపాధ్యాయులు అంకితభావంతో కృషి చేయాలని కోరారు. ఎంఈఓ లావూరి వెంకన్న అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో గెజిటెడ్ ప్రధానోపాధ్యాయులు నాగజ్యోతి, గోపి, శ్రీ వెంకట్, ఉపాధ్యాయ సంఘాల నాయకులు పాంపాటి శ్రీనివాసులు, కొమ్మరాజు సైదులు, మురారి శెట్టి రమేష్, వెంకట్ రెడ్డి పాల్గొన్నారు.

# పీఠాధిపతులకు ప్రభుత్వ విప్ ఆహ్వానం



రాజన్న సిరిసిల్ల, సెప్టెంబర్ 20:(నేటినిజం ప్రతినిధి): వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి ఆలయానికి రావాల్సిందిగా శృంగేరి జగద్గురు శ్రీశ్రీశ్రీ భారతి తీర్థ మహాస్వామి,పీఠాధిపతి శ్రీశ్రీశ్రీ విధుశేఖర భారతి స్వామి వారిని రాష్ట్ర ప్రభుత్వ విప్,వేములవాడ శాసనసభ్యులు ఆది శ్రీనివాస్ కోరారు.రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, రాజన్న ఆలయ ఈవో రమాదేవి, ఆలయ బృందం శనివారం శృంగేరి జగద్గురు శ్రీశ్రీశ్రీ భారతి తీర్థ మహాస్వామి, పీఠాధిపతి శ్రీశ్రీశ్రీ విధుశేఖర భారతి స్వామివరాలను కలిశారు.దక్షిణ కాశీగా విరజిల్లుతున్న వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి క్షేత్ర విస్తరణ అభివృద్ధిలో భాగంగా స్వామివారి విజయ యాత్రను పునస్కరించుకొని తెలంగాణ రాష్ట్ర పర్యటన ఉన్నందున స్వామివారులను వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి వారి సన్నిధికి రావాల్సిందిగా ఆహ్వాన పత్రికను అందజేశారు. ఇట్టి ఆహ్వానాన్ని మన్నించి వారి ఆశీస్సులను అందజేసి రాజన్న క్షేత్రానికి వచ్చే మాసంలో స్వామివారులు తప్పకుండా వస్తానని వారి ఆశీస్సులను అందజే శారు.గతంలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశాల మేరకు రాజన్న ఆలయ అభివృద్ధి, విస్తరణపై పలు మార్లు శృంగేరి పీఠాధిపతి శ్రీశ్రీశ్రీ విధుశేఖర భారతి స్వామి వారిని కలసి వారి సూచనలు సలహాల మేరకు ఇప్పటికే పనులు ప్రారంభించారు. ప్రస్తుతం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రత్యేక చొరవతో వేములవాడ రాజన్న ఆలయంలో జరుగుతున్న అభివృద్ధి విస్తరణ పనుల పురోగతిపై స్వామివారికి వివరించారు.అనంతరం రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, రాజన్న ఆలయ బృందం శృంగేరిలోని శ్రీ శారద అమ్మవారిని దర్శించుకొని తుంగభద్ర నదిలో ప్రత్యేక పూజలు నిర్వహిం చారు.వారి వెంట రాజన్న ఆలయ ఈవో ఎల్ రమాదేవి, ఆలయ ఇన్చార్జ్ స్థానాచారి నమిలికొండ ఉమేష్ శర్మ, చంద్రగిరి శరత్, శృంగేరి తెలంగాణ రాష్ట్ర బాధ్యులు రాధాకృష్ణ శర్మ ఉన్నారు.

# శ్రీ చైతన్య స్కూల్లో అంబరాన్నంటిన బతుకమ్మ సంబరాలు



రాజన్న సిరిసిల్ల, సెప్టెంబర్ 20:(నేటినిజం ప్రతినిధి): తెలంగాణ సాంస్కృతిక సంప్రదాయానికి ప్రతీక అయిన బతుకమ్మ పండుగ సంబరాలు శనివారం వేములవాడ పట్టణంలోని శ్రీ చైతన్య స్కూల్లో ముందస్తు బతుకమ్మ వేడుకలు అత్యంత వైభవంగా నిర్వహించారు. ఈ వేడుకలో మహిళా అధ్యాపకులు, విద్యార్థినులు బతుకమ్మలను పేర్చి ఆడుతూ ఆనందించారు.ప్రిన్సిపాల్ లు సుదేష్ కుమారి, లీలావతి మాట్లాడుతూ, బతుకమ్మ పండుగ తెలంగాణ ఆత్మను ప్రతిబింబిస్తుందని, పాఠశాలలో ఏటా ఈ వేడుకలను నిర్వహించడం ఆనందదాయకమని తెలిపారు. విద్యార్థులకు, అధ్యాపకు లకు శుభాకాంక్షలు తెలియజేశారు. ఆటపాటలతో సందడి మహిళా ఉపాధ్యాయురాలు , విద్యార్థినులు తీరొక్క పూలతో బతుకమ్మలను అందంగా పేర్చారు .అనంతరం కొబ్బరికాయలు కొట్టి ఆటలు ప్రారంభించి, "బతుకమ్మ బతుకమ్మ ఉయ్యాలఅంటూ ఆటపాటలతో పాఠశాల ప్రాంగణం మార్మోగింది. విద్యార్థులు నృత్యాలు చేస్తూ ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల చైర్మన్ మల్లెం పాటి శ్రీధర్, డైరెక్టర్ శ్రీవిద్య, ఏజీఎం ముద్ర కోల రాజు( వేములవాడ), అకాడమిక్ కోఆర్డినేటర్ మమతా రెడ్డి. మిర్యాల మమత, ఇన్చార్జులు అంజయ్య, అరుణ, రజిత, ప్రవళిక, యశస్విని, హరీష, పి ఈ టి లు సుధాకర్, తిరుపతి, మారుతి, కవిత, అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ సుధీర్ పాల్గొన్నారు.

# పరిశుభ్రతను పెంపొందించడానికి మరియు పెండింగ్‌లో ఉన్న సమస్యలను పరిష్కరించడానికి ప్రత్యేక ప్రచారం 5.0

న్యూఢిల్లీ, సెప్టెంబర్ 20:భారత ప్రభుత్వ యువజన వ్యవహారాలు మరియు క్రీడా మంత్రిత్వ శాఖ, క్రీడా శాఖ, బాధ్యతాయుతమైన పాలనను పెంపొందించడంలో మరియు పరిపాలనా ప్రక్రియలను క్రమబద్ధీకరించడంలో ఒక ప్రమాణాన్ని నిర్దేశిస్తూనే ఉంది. ప్రత్యేక ప్రచారం 4.0 యొక్క ముఖ్యమైన విజయాల తరువాత, ఈ-వ్యర్థాల నిర్వహణ నియమాలు, 2022 యొక్క నిబంధనలకు కట్టుబడి, ఎలక్ట్రానిక్ వ్యర్థాలను బాధ్యతాయుతమైన నిర్వహణ మరియు శాస్త్రీయంగా పారవేయడంపై దృష్టి సారించిన నిబద్ధతతో, ప్రత్యేక ప్రచారం 5.0 యొక్క సన్నాహక దశకు ఈ శాఖ పునాది వేసింది.

క్రీడల శాఖ అక్టోబర్ 2, 2024న మేజర్ ధ్యాన్‌చంద్ స్టేడియంలో ఫిట్ ఇండియా స్వచ్ఛత ఫ్రీడమ్ రన్ 5.0 ను ఉత్సాహంగా ప్రారంభించడంతో ప్రత్యేక ప్రచారం 4.0 ను ప్రారంభించింది. ఈ కార్యక్రమం జాతీయ గౌరవానికి చిహ్నంగా ఫిట్‌నెస్ మరియు పరిశుభ్రత అనే అంశాలను కలిపింది. ఈ విభాగం, దాని కింద ఉన్న సంస్థలతో కలిసి - స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా , లక్ష్మీబాయి నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫిజికల్ ఎడ్యుకేషన్ , నేషనల్ స్పోర్ట్స్ యూనివర్సిటీ , నేషనల్ యాంటీ-డోపింగ్ ఏజెన్సీ , మరియు నేషనల్ డోప్ టెస్టింగ్ లాబొరేటరీ పెండింగ్‌లో ఉన్న 15 పార్లమెంటు సభ్యుల సూచనలను శ్రద్ధగా క్లియర్ చేసింది, 30 ప్రజా ఫిర్యాదులను పరిష్కరించింది మరియు సీనియర్ అధికారులు ప్రతి దశలో పురోగతిని చురుకుగా పర్యవేక్షించడంతో రెండు పార్లమెంటరీ హామీలను నెరవేర్చింది.

క్షేత్ర స్థాయిలో, ఈ విభాగం పరిధిలోని నంద్తల ఫీల్డ్ కార్యాలయాలు మరియు ప్రధాన కార్యాలయాలలో విస్తరించి ఉన్న 44 గుర్తించబడిన ప్రదేశాలలో శుభ్రత డ్రైవ్‌లు జరిగాయి. ఈ సమిష్టి ప్రయత్నం ఫలితంగా 12,000 చదరపు అడుగుల స్థలాన్ని తిరిగి పొందడం జరిగింది, కొత్తగా అందుబాటులో ఉన్న అనేక ప్రాంతాలు విలువైన యుటిలిటీ స్థలాలుగా పునర్నిర్మించబడ్డాయి. అదనంగా, ప్రచారం సమయంలో వ్యర్థాల తొలగింపు ద్వారా రూ. 1,76,000 ఆదాయం సమకూరింది, ఇది పరిశుభ్రత సాధనలో స్థిరత్వం మరియు వనరుల పట్ల నిబద్ధతను నొక్కి చెబుతుంది.

కార్యాలయ పరిశుభ్రతలో ఉన్నత ప్రమాణాలను నెలకొల్పడం మరియు DARPG నిర్దేశించిన లక్ష్యాలను సాధించడం లక్ష్యంగా ప్రత్యేక ప్రచారం 5.0 ను అత్యంత ప్రభావవంతంగా అమలు చేయడానికి క్రీడా శాఖ సిద్ధంగా ఉంది.

# మహిళ హత్య.. ఏడాదిన్నర తర్వాత మృతదేహానికి మళ్లీ పోస్టుమార్టం

మెదక్, సెప్టెంబర్ 20: గత ఏడాదిన్నర క్రితం (సుమారు 490 రోజుల క్రితం) మునిపల్లి గ్రామానికి చెందిన అనుసుజ (53) పాపన్నపేట మండలం ఏడుపాయల శివారులో (మే18-2024)న హత్యకు గురైన విషయం తెలిసిందేనని సదాశివపేట సీఐ వెంకటేష్ తెలిపారు.

శనివారం మండల కేంద్రమైన మునిపల్లిలో అనుసుజ మృతదేహానికి ఇన్నాళ్ల తర్వాత రెండోసారి పోస్ట్ మార్టం నిర్వహించారు.

ఈ సందర్భంగా సీఐ వెంకటేష్ మాట్లాడుతూ.. గత ఏడాది మే నెలలో మహిళ అదృశ్యమై అదే నెల మృతదేహం లభ్యమైనట్లు తెలిపారు.

మహిళ మృతి అనంతరం మృతురాలి కుమారుడితో డీఎన్ఏ పరీక్ష నిమిత్తం వైద్యాధికారులు మృతదేహం నుంచి కావలసిన రక్త నమూనాలను సేకరించి కొడుకు ప్రవీణ్‌కు డీఎన్ఏ టెస్ట్ నిర్వహించారు.

గతంలో అధికారులు నిర్వహించిన డీఎన్ఏ పరీక్షల్లో తల్లి, కొడుకుకు డీఎన్ఏ టెస్ట్ మ్యాచ్ కాకపోవడంతో సంగారెడ్డి జిల్లా మండల కేంద్రమైన మునిపల్లిలో రెండోసారి మహిళ సమాధి తవ్వి మృతదేహం నుంచి డీఎన్ఏ టెస్టుకు కావాల్సిన ఎముకలను తీసుకెళ్లినట్లు తెలిపారు.

సంగారెడ్డి మెడికల్ కాలేజ్ డాక్టర్ రాము ఆధ్వర్యంలో మహిళ మృతదేహాన్ని బయటకు తీసి డీఎన్ఏ టెస్ట్ కోసం కావాల్సిన పరికరాలను తీసుకున్నట్టు సీఐ వెంకటేశ్ తెలిపారు.

సీఐ వెంకటేశ్ వెంట మునిపల్లి తహసీల్దార్ గంగాభవాని, ఎస్ఐ రాజేష్ నాయక్, ఆర్ఐ సుభాష్, గ్రామస్తులు ఉన్నారు.

Printed, Published and owned by VEENADAS, at Freedom Publications, SRT-74, Jawahar nagar, Ashok nagar, Hyderabad-500 020, Telangana. Published at SRT-74, Jawahar nagar, Ashok nagar, Hyderabad-500020. Telangana.'Editor: **BAISA DEVADAS.** RNI No.52865/93. E-mail :netinijam93@gmail.com